ఆదివారం
04-09-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 74
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

గుజరాత్‌లో ఉద్యోగుల పోరుబాట

ధర్నాలు, రాస్తారోకోలతో బీజేపీ సర్కార్ ఉక్కిరిబిక్కిరి

- భూపేంద్ర పటేల్ ప్రభుత్వంపై ఆగ్రహం
- డిమాండ్ల పరిశీలనకు మంత్రుల కమిటీ

అహ్మదాబాద్: ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులు, రైతులు, మాజీ సైనికోద్యోగులు, వ్యాపారులు తిరుగుబాటు బావుటా ఎగురవేయడంతో రెండు దశాబ్దాలకు పైగా గుజరాత్‌లో పాలన సాగిస్తున్న బీజేపీకి పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నాయి. నిత్యం ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళనలు నిర్వహిస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. పోలీసులే ప్రభుత్వంపై తిరగబడటం అక్కడి దారుణ పరిస్థితికి అద్దంపడుతోంది. అన్నివర్గాల్లో భూపేంద్ర పటేల్ ప్రభుత్వంపై ఆగ్రహం పెల్లుబుకుతోంది. 22 ఏళ్లుగా ప్రతిపక్షమే లేదన్నట్టు పాలన సాగిస్తూ ఎవ్వరినీ నోరెత్తకుండా చేసిన బీజేపీ నేతలు ఇప్పుడు అన్ని వర్గాల్లో రగులుతున్న ఆగ్రహ జ్వాలలను తట్టుకోలేకపోతున్నారు. ఈ ఏడాది చివరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండడంతో విధిలేని పరిస్థితుల్లో వివిధ వర్గాల డిమాండ్ల పరిశీలనకు ప్రభుత్వం నలుగురు మంత్రులతో కమిటీ వేయాల్సి వచ్చింది.

పోలీసులే మొదటగా తిరుగుబాటు చేశారు. ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కారు ఏమాత్రం పట్టించుకోవటంలేదని ఆగ్రహించి నెల క్రితం మెరుపు సమ్మెకు దిగారు. దీంతో దిగ్భ్రాంతికి గురైన ప్రభుత్వం పోలీసుల

- మిగతా 2 లో

ఇంకెన్నాళ్లు?

ఎనిమిదేళ్లయినా విభజన హామీలు అమలు కాలేదు

- రెవెన్యూ లోటు భర్తీ చేయండి
- కేంద్ర సంస్థల నిర్మాణాలకు నిధులివ్వండి
- పోలవరం బకాయిలు ఎప్పుడిస్తారు?
- దక్షిణాది రాష్ట్రాల మండలి సమావేశంలో మంత్రి బుగ్గన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర విభజన జరిగిన ఎనిమిది సంవత్సరాలు దాటినా ఇంతవరకు చాలా హామీలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయలేదని, ఏపీ, తెలంగాణల మధ్య నెలకొన్న సమస్యలు పరిష్కారం కాలేదని, వాటిని తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ కోరారు. దక్షిణాది రాష్ట్రాల జోనల్ కౌన్సిల్ కేరళ రాజధాని తిరువనంతపురంలో శనివారం సమావేశమైంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్రాల మధ్య వివాదాస్పదంగా ఉన్న వివిధ అంశాలపై చర్చించారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ నుంచి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. విభజన సమస్యలను మంత్రులు ప్రస్తావించారు. గత నెల 29వ తేదీన దీనికి సంబంధించి సీఎం జగన్ ప్రత్యేక సమావేశం నిర్వహించి, దక్షిణాది రాష్ట్రాల మండలి సమావేశంలో ఏం మాట్లాడాలో మంత్రులకు మార్గనిర్దేశనం చేశారు. ఆ మేరకు మంత్రి బుగ్గన ఈ సమావేశంలో అన్ని సమస్యలను ప్రస్తావించారు. విభజన వల్ల ఏపీ తీవ్రంగా నష్టపోయిందని, హైదరాబాద్ లాంటి మహానగరాన్ని వదులుకోవడంతో ఆదాయం కోల్పోయామని తెలిపారు. రెవెన్యూ లోటును కేంద్రమే భర్తీ చేయాల్సి ఉందని గుర్తు చేశారు. విద్య, వైద్య సంస్థల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేయాలని, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. ఏపీకి అత్యంత కీలకమైన పోలవరం ప్రాజెక్టు బాధితుల పునరావాసానికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన నిధులను తక్షణమే విడుదల చేయాలని కోరారు. రామాయపట్నం పోర్టు, భోగాపురం విమానాశ్రయం గురించి ప్రస్తావించారు. తెలుగు రాష్ట్రాల మధ్య గల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విభజన అంశాలు, తెలుగు రాష్ట్రాల మధ్య పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. ఆ వ్యవస్థ కేవలం పరిష్కారాలు సూచించడమే కాకుండా దక్షిణాది రాష్ట్రాల మండలి తీసుకున్న నిర్ణయాలను అమలు చేసేదిగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. విభజన సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతున్న కొద్దీ ఏపీకి మరింత ఎక్కువ ఆర్థిక నష్టం జరుగుతోందని వివరించారు. విభజన అంశాల అమల్లో ఇప్పటికే చాలా ఆలస్యం జరిగిందని, ఇకనైనా సత్వర పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశానికి తెలంగాణ తరపున ఆ రాష్ట్ర హోంమంత్రి మహమూద్ ఆలీ, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. వీరు ఏపీ, తెలంగాణ మధ్య పేరుకున్న విద్యుత్ బకాయిలు, 9,10 షెడ్యూళ్లకు సంబంధించిన విభజన సమస్యలు, కృష్ణా జలాల పంపిణీ, నీటిపారుదలకు సంబంధించిన సమస్యలను ప్రస్తావించినట్లు తెలిసింది.

భూమి కోసం ప్రాణాలొదిలిన రైతు

- ఉద్దేశపూర్వకంగానే హత్య చేశారంటూ కుటుంబసభ్యుల ఆందోళన
- అధికారులపై చర్యలు తీసుకోవాలి అఖిలపక్షం డిమాండ్

విశాలాంధ్ర-వెదురుకుప్పం/పెనుమూరు: చిత్తూరు జిల్లా పెనుమూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం భూమి కోసం ఓ రైతు ప్రాణాలొదిలిన ఘటన చోటుచేసుకుంది. మండలంలోని రామకృష్ణాపురం పంచాయతీ రాజాఇండ్లు గ్రామానికి చెందిన రత్నం బోయుడు (55) అనే రైతుకు సర్వే నెంబర్ 918/4లోని భూమికి 1974లో లీజు పట్టా ఇచ్చారు. రైతుకు భూమి చెందకూడదనే ఉద్దేశంతో తిమ్మరాజు కండ్రిగ గ్రామస్తులు తరచూ అభ్యంతరం చెబుతుండడంతో రత్నం... 2009లో చిత్తూరు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా ఆ భూమి అతడిదేనని న్యాయస్థానం పర్మినెంట్ ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చింది. ఆ తర్వాత తిమ్మరాజు కండ్రిగ గ్రామస్తులు కొన్ని అభ్యంతరాలు చెబుతూ ఇటీవల రత్నంకు చెందిన భూమిలో పక్కా ఇళ్లు నిర్మించుకున్నారు.

ఈ విషయంలోనూ రత్నం కోర్టుకు వెళ్లారు. నాలుగు రోజుల క్రితం మిగిలిన భూమిని చదును చేసేందుకు ప్రయత్నించారు. వీఆర్వో వెళ్లి పనులు చేయకూడదని అభ్యంతరం చెప్పారు. ఇదే విషయంపై అదేరోజు తహసీల్దార్ రమణిని కలిసి సమస్య

- మిగతా 2 లో

ప్రపంచంలోనే ఐదో ఆర్థిక శక్తిగా భారత్

ముంబై: భారత ఆర్థిక వ్యవస్థ వేగవంతమైన వృద్ధి నమోదుచేస్తోంది. కరోనా మహమ్మారి సృష్టించిన సవాళ్లను అధిగమించి క్రమంగా కోలుకోవడమే గాక, వేగంగా అడుగులు వేస్తూ సత్తా చాటుతోంది. తాజాగా బ్రిటన్‌ను దాటేసి ప్రపంచంలోనే ఐదో ఆర్థిక శక్తిగా అవతరించిందని 'బ్లూమ్‌బర్గ్' వెల్లడించింది. 2021 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో భారత్... బ్రిటన్‌ను దాటేసి ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని 'బ్లూమ్‌బర్గ్' కథనం. అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి సేకరించిన జీడీపీ గణాంకాల ప్రకారం... ఆ త్రైమాసికం చివరి నాటికి భారత ఆర్థిక వ్యవస్థ పరిమాణం 854.7 బిలియన్ డాలర్లు ఉండగా... యూకే ఆర్థిక వ్యవస్థ 816 బిలియన్ డాలర్లు మాత్రమే. కొంతకాలంగా బ్రిటన్ ఆర్థిక

- మిగతా 2 లో

176 మంది ఉత్తమ ఉపాధ్యాయులు

రేపు సీఎం చేతుల మీదుగా పురస్కారాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: భారతదేశ తొలి ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా రాష్ట్రంలోని 176 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేశ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న ఉదయం 10 గంటలకు విజయవాడలోని 'ఎ' కన్వెన్షన్ సెంటరులో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తమ ఉపాధ్యాయులను పురస్కారాలతో పాటు సన్మానిస్తారని తెలిపారు. పాఠశాల విద్యాశాఖ నుంచి 58మంది ఉపాధ్యాయులను, ఇంటర్మీడియేట్ విద్య నుంచి 19 మందిని, ఉన్నత విద్య నుంచి 60 మందిని, భాషా, సాంస్కృతిక శాఖ నుంచి ఐదుగురిని, కేజీబీవీల నుంచి ముగ్గురితో పాటు స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలను

- మిగతా 2 లో

పోలవరం నిర్వాసితులకు పునరావాసం కల్పించండి

సీఎం జగన్‌కు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ

3లో

అడ్డుకుంటే రోడ్డెక్కుతాం

- తలదించుకునే పరిస్థితి తెచ్చుకోవద్దు
- పోలీసులకు పవన్ కల్యాణ్ హితవు

3లో

నవరత్నాలతో ఆశించిన ఫలితాలు

- మన-తన తేడాలు చూపొద్దు
- ఇడుపులపాయ సమీక్షలో సీఎం జగన్

2లో

శ్రీలంక చేరుకున్న గొటబయ

కొలంబో: ప్రజల ఆగ్రహానికిగురై విదేశాలకు పారిపోయిన శ్రీలంక మాజీ అధ్యక్షుడు గొటబయ రాజపక్స(73) తిరిగి స్వదేశానికి చేరుకున్నారని విమానాశ్రయ అధికారి ఒకరు తెలిపారు. విమానాశ్రయంలో దిగిన రాజపక్సేకు వివిధ శాఖల మంత్రులు, రాజకీయ నేతలు పూలతో స్వాగతం పలికారు. బ్యాంకాక్ నుండి సింగపూర్ మీదుగా సింగపూర్ ఎయిర్‌లైన్స్ విమానంలో దేశానికి చేరుకున్నట్లు తెలుస్తోంది.దాదాపు 50రోజుల ప్రవాసం తర్వాత స్వదేశానికి రాజపక్స తిరిగివచ్చారు. వర్చువల్ ఖైదీగా థాయ్ హోటల్‌లో ఉన్న రాజపక్స దేశంలోకి తిరిగి వచ్చేందుకు అవకాశం కల్పించాల్సిందిగా వారసుడు, ప్రస్తుత అధ్యక్షుడు రణిల్ విక్రమ్‌సింఘేను అభ్యర్థించినట్లు సమాచారం. దేశంలో నెలకొన్న ఆర్థిక సంక్షోభంతో నిత్యావసరాలైన ఆహారం, ఇంధనం ఖర్చులు పెరిగిపోయాయి. ఈ సంక్షోభానికి రాజపక్స సోదరులే కారణమంటూ ప్రజలు కొన్ని నెలల పాటు ఆందోళనలు చేపట్టిన సంగతి తెలిసిందే. ప్రజలు ఆగ్రహంతో అధ్యక్ష భవనాన్ని ముట్టడించడంతో మిలటరీ సాయంతో రాజపక్స దేశం నుండి పారిపోయారు. మొదట మాల్దీవుల్లో తలదాచుకున్న రాజపక్స అక్కడి నుండి సింగపూర్, తర్వాత థాయ్‌లాండ్‌కు చేరుకున్నారు. అక్కడి ప్రభుత్వ 90రోజులు మాత్రమే అనుమతి ఇవ్వడంతో స్వదేశానికి రావాలని నిర్ణయించుకున్నారు.

యూరప్‌కు గ్యాస్ నిలుపుదల : రష్యా

ఫ్రాంక్‌ఫర్ట్ : రష్యా నిలిపివేసిన నార్డ్‌స్ట్రీమ్ 1 పైప్‌లైన్ ద్వారా యూరప్‌కు పంపే సహజవాయువును తిరిగి ప్రారంభించేందుకు చేపట్టిన ప్రణాళికలను రద్దుచేసింది. నిర్వహణ సమయంలో నార్డ్ స్ట్రీమ్ 1 పైప్‌లైన్‌లో లోపాలను కనుగొనడంతో నిలిపివేసినట్లు ప్రకటించింది. గాజ్‌ప్రోమ్ తీసుకున్న ఈ నిర్ణయం శీతాకాలానికి ముందు ఇంధనాన్ని భద్రపరచడంలో యూరప్ ఇబ్బందులను మరింత కష్టతరం కానుంది. జర్మనీకి ప్రధాన గ్యాస్ సరఫరాలను తిరిగి ప్రారంభించడానికి రష్యా గడువును రద్దు చేసింది. బాల్టిక్ సముద్రం కింద నడుస్తున్న నార్డ్ స్ట్రీమ్ 1, నిర్వహణ కోసం మూడు రోజుల ప్రవాహం నిలిచిపోవడంతో శనివారం తిరిగి పనిచేయాల్సి ఉంది. అయితే పైప్‌లైన్ ద్వారా రష్యన్ గ్యాస్ ఎగుమతులపై ఆధిపత్యాన్ని కలిగిన గాజ్‌ప్రోమ్, కీలకమైన టర్బైన్‌లో చమురు లీక్‌ను పరిష్కరించే వరకు డెలివరీలను పునఃప్రారంభించలేమని శుక్రవారం తెలిపింది. సాధారణంగా నార్డ్ స్ట్రీమ్ 1 టర్బైన్‌లకు సేవలందించే సిమెన్స్ ఎనర్జీ, అటువంటి లీక్ వల్ల పైప్‌లైన్ ఆపరేట్ చేయకూడదని పేర్కొంది. రష్యా ఉక్రెయిన్‌పై దాడి చేసిన తర్వాత పశ్చిమ దేశాలు విధించిన ఆంక్షలు, సాధారణ కార్యకలాపాలు నార్డ్ స్ట్రీమ్ 1 నిర్వహణకు ఆటంకం కలిగించాయని మాస్కో ఆరోపించింది. బ్రస్సెల్స్ ఇది ఒక సాకు అని రష్యా ప్రతీకారం తీర్చుకోవడానికి గ్యాస్‌ను ఆర్థిక ఆయుధంగా ఉపయోగిస్తోందని పేర్కొంది. జర్మనీ పార్లమెంటరీ విదేశీ వ్యవహారాల కమిటీ చైర్ మైఖేల్ రోత్ ట్వీట్ చేస్తూ, "మనపై రష్యా చేస్తున్న మానసిక యుద్ధంలో భాగంగా పేర్కొన్నారు.

తైవాన్‌కు 1.1 బిలియన్ డాలర్ల అమెరికా సాయం

వాషింగ్టన్ : తైవాన్‌కు 1.1 బిలియన్ డాలర్ల విలువైన సైనిక సహాయాన్ని అమెరికా శుక్రవారం ప్రకటించింది. అమెరికా పార్లమెంటు దిగువ సభ స్పీకర్ నాన్సీ పెలోసీ తైవాన్‌లో పర్యటించిన నెలరోజుల అనంతరం అమెరికా తాజాగా ఈ ప్రకటన వెల్లడించింది. ఈ ప్యాకేజీలో భాగంగా తైవాన్ భూభాగం వైపు వచ్చే క్షిపణులను గుర్తించడంలో సహాయపడే ముందస్తు రాడార్ హెచ్చరిక వ్యవస్థ కోసం 665 మిలియన్ డాలర్లు, ఓడలను ముంచే సామర్థ్యం కలిగిన 60 అత్యాధునిక హర్పూన్ క్షిపణుల కోసం 355 డాలర్లను ప్రకటించింది. ఈ ప్యాకేజీ తైవాన్ భద్రతకు అత్యవసరమని విదేశాంగ శాఖ ప్రతినిధి తెలిపారు. తైవాన్‌పై ఆర్థిక, సైనిక, దౌత్యపరమైన ఒత్తిడిలను నిలిపివేయాలని, అలాగే తైవాన్‌తో చర్చల్లో పాల్గొనాలని చైనాను కోరుతున్నామన్నారు. తైవాన్ ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా వివిధ సమస్యల శాంతియుత పరిష్కారానికి అమెరికా మద్దతు కొనసాగిస్తుందని చెప్పారు.

176 మంది ఉత్తమ ఉపాధ్యాయులు

(మొదటిపేజీ తరువాయి)

26 పాఠశాలలను, జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఐదుగురుని ఎంపిక చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ, పాఠశాల విద్య ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి గారు తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలకు ఇప్పటికే సమాచారం అందించామని సురేష్‌కుమార్ తెలిపారు.

ప్రపంచంలోనే ఐదో ఆర్థిక శక్తిగా భారత్

(మొదటిపేజీ తరువాయి)

ఇబ్బందులను ఎదుర్కొంటోంది... ఆ దేశంలో ద్రవ్యోల్బణం రికార్డు స్థాయికి చేరుకుంటోంది... ఈ క్రమంలోనే ఆర్థిక వ్యవస్థ కుదేలైందని ఆ కథనం పేర్కొంది. రాబోయే రోజుల్లో బ్రిటన్ జీడీపీ మరింత పతనమయ్యే ప్రమాదముందని తెలిపింది. ఈ ఏడాది భారత కరెన్సీ రూపాయి విలువతో పోలిస్తే బ్రిటన్ కరెన్సీ పౌండ్ విలువ 8 శాతం మేర క్షీణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7 నుంచి 7.5 శాతంగా వృద్ధి నమోదవ్వొచ్చని అంచనాలు వెలువడుతున్నాయి. 2021-22లో మన దేశం 8.7 శాతం వృద్ధి నమోదు చేసింది. సరిగ్గా దశాబ్దం క్రితం అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల జాబితాలో భారత్ 11వ స్థానంలో ఉండగా... బ్రిటన్ ఐదో స్థానంలో నిలిచింది. తాజాగా యూకేను దాటేసి భారత్ ఐదో స్థానానికి ఎగబాకడం విశేషం. భారత్ కంటే ముందు అమెరికా, చైనా, జపాన్, జర్మనీ తొలి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. భారత్ ఐదో ఆర్థిక శక్తిగా అవతరించడంపై కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. భారత నౌకాదళానికి కొత్త చిహ్నాన్ని ఆవిష్కరించిన రోజే... భారత్ బ్రిటన్‌ను దాటేసి ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం ఆనందంగా ఉందని ఆయన అన్నారు. రాబోయే దశాబ్దంలో భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారడమే గాక, అతిపెద్ద ఆర్థిక శక్తిగా అవతరిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

గుజరాత్‌లో ఉద్యోగుల పోరుబాట

(మొదటిపేజీ తరువాయి)

సంక్షేమానికి రూ.500 కోట్లు విడుదల చేసింది. ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంఘం భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్)సైతం ఆందోళన బాటపట్టింది.అధిక విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా కచ్, బన్స్‌కాంత జిల్లాల్లో ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టింది. అలాగే ఒక్కో జిల్లాలో వ్యవసాయ మోటార్ల విద్యుత్ చార్జీలు ఒక్కో రకంగా ఉన్నాయి. రాష్ట్రంలో సగం విద్యుత్ అదానీ పవర్ నుంచే కొనుగోలు చేస్తుండటంతో చార్జీలపై ప్రభుత్వానికి ఏమాత్రం నియంత్రణలేకుండా పోయింది. దీంతో రాష్ట్రమంతా ఒకేరకం చార్జీలు వసూలు చేయాలని రైతులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. పంచాయతీరాజ్ శాఖలో పనిచేస్తున్న 9 వేలమంది తమ డిమాండ్ల సాధనకు ఆందోళన ప్రారంభించారు. వీరి ఆందోళన ఉధృతికి ఏకంగా రెవెన్యూశాఖ మంత్రి జితేంద్ర ద్వివేదీ పదవి పోగొట్టుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. మాజీ సైనికోద్యోగులు సైతం రాష్ట్ర ప్రభుత్వంపై పోరుకు దిగారు. అమర జవాన్ల కుటుంబాలకు కేవలం రూ. లక్ష మాత్రమే ఎక్స్‌గ్రేషియా ఇవ్వడం అన్యాయమని, ఆ మొత్తాన్ని పెంచాలని ఆరు మాసాలుగా వారు ఆందోళన చేపడుతున్నారు. అయినా పట్టించుకోని ప్రభుత్వం ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడటంతో ఉద్యమానికి భయపడి ఎక్స్‌గ్రేషియా రూ.కోటికి పెంచింది. రాష్ట్రంలో 26 వేల మంది ఆరోగ్య కార్యకర్తలు ఆందోళన చేపడుతున్నారు. ఆరోగ్య ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో గత నెల 8 నుంచి సమ్మె చేస్తున్నారు. పీఆర్సీ కోసం ప్రభుత్వ ఉద్యోగులు పోరుబాట పట్టారు. వెంటనే పీఆర్సీ ప్రకటించాలని, కాంట్రాక్టు వ్యవస్థను ఎత్తేయాలని డిమాండ్ చేస్తూ సోషల్ మీడియాలో ప్రచారం చేపట్టారు.

భూమి కోసం ప్రాణాలొదిలిన రైతు

(మొదటిపేజీ తరువాయి)

వివరించాడు. అక్కడే ఉన్న స్థానిక ప్రజాప్రతినిధి, రత్నానికి మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన రైతు అనారోగ్యం పాలయ్యాడు. ఆసుపత్రిలో చికిత్స పొంది ఆరోగ్యం కుదుట పడిన తర్వాత శుక్రవారం నుంచి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేపట్టాడు. ఈక్రమంలో శనివారం మధ్యాహ్నం అధికారులతో మాట్లాడుతూనే ఒక్కసారిగా కుప్పకూలాడు. సిబ్బంది అతడిని హుటాహుటిన ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న మృతుడి కుమారులు, కుమార్తె తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగారు. ఉద్దేశపూర్వకంగానే రాజకీయ నాయకుల అండతో తమ తండ్రిని హత్య చేసి ఆసుపత్రికి తరలించారని ఆరోపించారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. రైతు మృతికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ, జనసేన నాయకులు డిమాండ్ చేశారు.

రత్నం కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వండి: జనార్థన్

తిరుపతి-విశాలాంధ్ర: పెనుమూరు మండలం రాజాఇండ్లు గ్రామానికి చెందిన రత్నం అనే రైతు మృతి చెందడానికి రెవెన్యూ అధికారుల వైఫల్యమే కారణమని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు టి.జనార్థన్ ఆరోపించారు. ప్రభుత్వం రత్నం కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని, కారకులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తన భూమిపై కోర్టు తీర్పు అనుకూలంగా వచ్చినా, రెవెన్యూ అధికారులు కాలయాపన చేసి అమలు చేయకపోవడం వలనే రైతు మృతి చెందాడన్నారు. రత్నం కుటుంబానికి న్యాయం జరగకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

తమిళనాడుకు హైస్పీడ్ రైల్వే కారిడార్ కావాలి

దక్షిణ జోనల్ మండలి సమావేశంలో స్టాలిన్

చెన్నై : తమిళనాడులోని కొన్ని నిర్దిష్ట ప్రాంతాలను, పొరుగు రాష్ట్రాలతో అనుసంధానం చేసే విధంగా హైస్పీడ్ రైల్వే కారిడార్‌ను ఏర్పాటు చేయాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శనివారం కేంద్రాన్ని కోరారు. తద్వారా ఎయిరోప్లేన్లు, ఆటోమొబైల్ల కంటే కూడా కాలుష్యం తగ్గుతుందని, ఇంధన సామర్థ్యం పెరుగుతుందని, పొదుపు జరుగుతుందని చెప్పారు. సగటు ప్రయాణ వేగాన్ని పెంచేందుకు హైస్పీడ్ రైల్వే కారిడార్ ఏర్పాటు చేయాలని, తమిళనాడులోని చెన్నై, కొయంబత్తూరు, ట్యూటికోరిన్, మధురై వంటి ప్రాంతాలను ఒకదానితో ఒకటి కలపడమే కాకుండా పొరుగు రాష్ట్రాలకూ అనుసంధానం చేయాలని శనివారం తిరువనంతపురంలో జరిగిన 30వ దక్షిణ జోనల్ మండలి సమావేశంలో స్టాలిన్ అన్నారు. ఈ సమావేశానికి కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా అధ్యక్షత వహించారు. హైస్పీడ్ రైల్వే కారిడార్ రూపొందించడం వల్ల కర్బన ఉద్గారాలను తగ్గించగలమని, రాష్ట్రాన్ని ఆర్థికంగా సుసంపన్నం చేయగలమని స్టాలిన్ చెప్పారు. అంతర్గత భద్రతకు సంబంధించి తమ ప్రభుత్వం కట్టుదిట్టమైన నిఘా ఏర్పాట్లు చేసిందని చెప్పారు. మతసామరస్యం, శాంతిభద్రతలకు విఘాతం కలగనివ్వమన్నారు. దక్షిణాది రాష్ట్రాల ఇంటెలిజెన్స్ చీఫ్‌ల మధ్య మెరుగైన సమన్వయం ఉండాలని సూచించారు. అంతర్గత భద్రత విషయంలో అంతా కలిసి పనిచేయాలని తోటి ముఖ్యమంత్రులను స్టాలిన్ కోరారు. ఇంధనం, విద్యుత్ రంగాలనూ ప్రస్తావించారు. విద్యుత్ సవరణ చట్టం-2022 ఉపసంహరించుకోవాలని, ప్రజలకు సరసమైన ధరలకు నాణ్యమైన విద్యుత్ అందించేలా రాష్ట్ర డిస్ట్రిబ్యూషన్ లైసెన్సులున్నవారికి అనుమతివ్వాలని కోరారు. దక్షిణాది రాష్ట్రాలకు టారిఫ్ షాక్‌ను నివారించడానికి రాయగఢ్-పుగలూర్-త్రిసూర్ 800 కిలోవాట్ హెచ్‌వీడీసీ వ్యవస్థను జాతీయ -వ్యూహాత్మక ప్రాముఖ్యత కలిగిన ఆస్తిగా ప్రకటించాలన్నారు. తమిళనాడులోని ఇతర వనరులతో పోల్చితే ఆఫ్‌షోర్ విండ్ మెషీన్‌లను అధిక సామర్థ్యంతో నిర్వహించవచ్చు అని అన్నారు. దేశంలోనే అత్యధిక ఆఫ్‌షోర్ విండ్ సామర్థ్యం 27 గిగావాట్‌లను తమిళనాడు కలిగి ఉందన్నారు. ఆఫ్‌షోర్ విండ్ ద్వారా ఉత్పత్తి చేసిన మొత్తం విద్యుత్‌ను కొనుగోలు చేయడానికి రాష్ట్రం సుముఖంగా ఉందని స్టాలిన్ తెలిపారు. అలాగే జీఎస్టీ కోసం పరిహార వ్యవధిని రెండేళ్లకు పొడిగించడం, రాష్ట్రానికి విపత్తు సహాయంతో పాటు ఇతర నిధులను తక్షణమే విడుదల చేయడం; తమిళనాడు అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ డిగ్రీ కోర్సుల బిల్లుకు ముందస్తుగా రాష్ట్రపతి ఆమోదించేలా చూడటం వంటి డిమాండ్లను స్టాలిన్ చేశారు. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా / భారత ప్రభుత్వం ద్వారా థర్డ్ పార్టీకి ఆస్తుల బదిలీ ద్వారా వచ్చిన దానిలో వాటాను కోరారు. ఇతర దేశాలు, వాటి మంత్రిత్వ శాఖలు, ఏజెన్సీలు, ప్రత్యేకించి పెట్టుబడి ప్రోత్సాహం, విద్యాసంస్థలను బలోపేతం చేయడం, పరిశ్రమల నెట్వర్క్‌ను పెంచుకోవడం కోసం అవగాహన ఒప్పందాలు (ఎంఓయులు) కుదుర్చుకోవడానికి తగిన సరళీకృత యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కూడా కేంద్రప్రభుత్వాన్ని స్టాలిన్ కోరారు. తదుపరి దక్షిణ మండలి సమావేశాన్ని తమిళనాడులో నిర్వహించేందుకు తమకు అవకాశమివ్వాలని అన్నారు.

నేడు ఆజాద్ పార్టీ ప్రకటన

జమ్మూ : కాంగ్రెస్‌తో ఐదు దశాబ్దాల అనుబంధాన్ని గులాం నబీ ఆజాద్ తెంచుకున్నారు. ఆదివారం నుంచి రాజకీయంగా కొత్త ప్రయాణాన్ని మొదలు పెట్టబోతున్నారు. ఇందుకోసం తన సొంత పార్టీ తొలి శాఖను జమ్మూలో నెలకొల్పేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఇదే క్రమంలో జమ్మూలో తొలిసారి బహిరంగ ర్యాలీ- సభ నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. ఆయన ఆదివారం ఉదయం ఢిల్లీ నుంచి జమ్మూకు చేరుకుంటారని మాజీ మంత్రి జీఎం సరూరీ అన్నారు. ఆజాద్‌కు ఘనస్వాగతం లభించనున్నదని, భారీ ర్యాలీగా సైనిక్ కాలనీలోని బహిరంగ సభ వేదికకు చేరుకుంటారని చెప్పారు. 73 ఏళ్ల ఆజాద్ తన సొంత పార్టీని ప్రకటించబోతున్నారు. ఇప్పటికే ఆజాద్‌కు స్వాగతం పలుకుతూ భారీస్థాయిలో బ్యానర్లు, హెూర్డింగులను జమ్మూ- విమానాశ్రయ రోడ్డు వెంబడి ఏర్పాటు చేశారు.

బహిరంగ సభలో 20వేల మంది కూర్చునేలా ఏర్పాట్లు చేశాం. ఆజాద్ కోసం కాంగ్రెస్‌ను వీడిన నేతలంతా ఈ కార్యక్రమానికి హాజరవుతారని సరూరీ తెలిపారు. సమాజంలోని వేర్వేరు వర్గాలకు చెందిన మూడు వేల మంది ఆజాద్‌కు మద్దతిస్తారన్నారు. పార్టీలో చేరతారని, ఇంత పెద్ద సంఖ్యలో చేరికల నిర్వహణ కష్టసాధ్యమని చెప్పారు. రాబోయే రోజుల్లో ఆజాద్ మద్దతుదారుల సునామీయే రాబోతోందని అన్నారు. ఆజాద్ సమర్థ నాయకుడు అని అందరికీ తెలుసన్నారు. ఆజాద్‌కు మద్దతుగా కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన ప్రముఖ నేతల్లో సరూరీ ఉన్నారు.

నవరత్నాలతో ఆశించిన ఫలితాలు

విశాలాంధ్ర-వేంపల్లె: గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెల్లడించారు. వైఎస్సార్ కడప జిల్లా వేంపల్లె మండలం ఇడుపులపాయ ఎస్టేట్‌లో శనివారం అధికారులు ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో జగన్ పాల్గొన్నారు. జగన్ మాట్లాడుతూ ఆర్థిక అసమానతలు తొలగించడం, అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. అందు కోసం గ్రామ లోగిళ్లలోనే సచివాలయ వ్యవస్థ ఏర్పాటుకు నాంది పలికామన్నారు. నవరత్నాల ద్వారా ఆశించిన ఫలితం దక్కిందన్నారు. ప్రభుత్వం అమలు చేసే విధానాలకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలన్నారు. ప్రభుత్వ సేవలు సక్రమంగా అందుతున్నాయన్నారు. వివక్షతకు తావు లేకపోతే వ్యవస్థ సక్రమంగా నడుస్తుందని జగన్ చెప్పారు. మన-తన వ్యత్యాసం లేకుండా వ్యవస్థ సమాంతరంగా కొనసాగేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు మరింత లోతుగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందని వెల్లడించారు. పాడా అభివృద్ధి పురోగతిపై ముఖ్యమంత్రికి కలెక్టరు విజయ రామరాజు సంక్షిప్తంగా వివరించారు. పులివెందుల నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనుల పురోగతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి వివరించారు. చక్రాయపేట మండలంలో వందలాది కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులు, అందులో ప్రధానంగా కాలేటివాగు ప్రాజెక్టు, గండిక్షేత్ర ఆలయ పునర్‌నిర్మాణం తదితర పనులపై జగన్ సంతృప్తి వ్యక్తంచేశారు. చక్రాయపేట మండలంలో సుమారు 4వేల హెక్టార్లలో మామిడి తోటలు సాగవుతుండటంతో ఇక్కడ మామిడి పల్పిజ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు అంశాన్ని వైసీపీ మండల నాయకులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. దేశ రాజధాని ఢిల్లీలో నిర్మిస్తున్న ఏపీ భవన్‌లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రజల తరపున జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి ముఖ్యమంత్రి జగన్‌ను కోరారు. వేంపల్లె మండల అభివృద్ధి పురోగతిని ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి వివరించారు. సమీక్షా సమావేశంలో కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేశ్, నియోజకవర్గ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి తెలంగాణ సీపీఐ రాష్ట్ర మహాసభలు

- **శంషాబాద్‌లో భారీ ప్రదర్శన, బహిరంగసభ**
- **ముఖ్య అతిథిగా డి.రాజా హాజరు**

విశాలాంధ్ర-హైదరాబాద్: సీపీఐ తెలంగాణ రాష్ట్ర మూడవ మహాసభలు ఆదివారం నుండి రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో ప్రారంభం కానున్నాయి. ఈ నెల 4 నుండి 7వ తేదీ వరకు జరిగే మహాసభల్లో గత మహాసభ నుండి నేటి వరకు జరిగిన కార్యక్రమాలు, పార్టీ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహిస్తారు. వచ్చే మూడేళ్లకు సంబంధించిన కార్యాచరణను రూపొందిస్తారు. దేశంలో మతోన్మాదం పెచ్చుమీరి, ప్రమాదకరస్థాయికి చేరిన నేపథ్యంలో రాష్ట్రంలో పాగా వేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్న తరుణంలో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర మహాసభలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. మహాసభ ప్రారంభ సూచికగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం(కామ్రేడ్ సిద్ధి వెంకటేశ్వర్లు మైదాన్)లో ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. రెండు గంటలకు ఇన్ జీసెస్ మైదానం నుండి ఉన్నత పాఠశాల వరకు రెడ్‌షర్ట్ వలంటీర్లతో భారీ ప్రదర్శన తలపెట్టారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగే బహిరంగసభలో ప్రధాన కార్యదర్శి డి.రాజా ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఆదివారం ఉదయం ఆయన నేరుగా కోల్‌కతా నుండి శంషాబాద్ చేరుకోనున్నారు. బహిరంగసభలో సీపీఐ జాతీయ కార్యదర్శులు అతుల్ కుమార్ అంజన్, వినయ్ విశ్వం, డాక్టర్ కె.నారాయణ, కార్యవర్గ సభ్యులు సయ్యద్ అజీజ్ పాషా, రాష్ట్ర సహాయ కార్యదర్శులు పల్లా వెంకటరెడ్డి, కూనంనేని సాంబశివరావు ప్రసంగించనున్నారు. ఈ నెల 5వ తేదీ నుండి శంషాబాద్‌లో కామ్రేడ్ గుండా మల్లేశ్ నగర్(మల్లికా కన్వెన్షన్ హాల్)లో ప్రతినిధుల సభ జరుగుతుంది. ఆ రోజు ఉదయం పది గంటలకు సీపీఐ పూర్వపు ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అరుణ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం అమరవీరుల స్థూపాన్ని సీపీఐ సీనియర్ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు ఆవిష్కరిస్తారు. డి.రాజా ప్రారంభోపన్యాసంతో ప్రతినిధుల సభ ప్రారంభమవుతుంది. సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సౌహార్థ సందేశాలిస్తారు. సీపీఐ పోరాటాలు, అలనాటి మహోజ్వల తెలంగాణ సాయుధ పోరాట చరిత్రతో మహాసభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను అతుల్ కుమార్ అంజన్ ప్రారంభిస్తారు. సోమవారం మధ్యాహ్నం చాడ వెంకటరెడ్డి కార్యదర్శి నివేదికను చర్చకు ప్రతిపాదిస్తారు. మూడు రోజుల పాటు నివేదికపై చర్చించి, మార్పులు, చేర్పులతో ఆమోదిస్తారు. చివరి రోజైన మంగళవారం నూతన రాష్ట్ర సమితి ఎన్నిక జరుగుతుంది. సీపీఐ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి.

'భారత్‌జోడో' విజన్‌పై కాంగ్రెస్‌కు స్పష్టత అవశ్యం

అధికారంలోకి వస్తే ప్రజలకు లభించే భరోసాను తెలపాలి

న్యూఢిల్లీ: కేంద్రంలోని మోదీ ప్రభుత్వ నిరంకుశత్వానికి, నియంత పాలనకు ముగింపు పలకాలని ప్రతిపక్ష కాంగ్రెస్ కంకణం కట్టుకుంది. ఇందుకోసం ఆ పార్టీ యువనేత రాహుల్ గాంధీ సర్వశక్తులు ఒడ్డుతున్నారు. వారసత్వ రాజకీయాల కళంకం తుడిచివేసేందుకు పార్టీ అధ్యక్ష బాధ్యతలను స్వీకరించేందుకు విముఖంగా ఉన్నారు. బీజేపీ ఏకపక్ష నిర్ణయాలను దుయ్యబడుతూ ప్రజా వ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు విమర్శలు గుప్పిస్తున్నదీ ఆయనే. ఈ నెల 7 నుంచి భారత్ జోడో యాత్ర రాహుల్ సారథ్యంలోనే జరగనుంది. నాడు మహాత్మాగాంధీ నేతృత్వంలో జరిగిన ఉప్పు సత్యాగ్రహంతో ఈ యాత్రను పోల్చుతున్న క్రమంలో రాహుల్ తన సత్తాను చాటుకోవడమే కాకుండా కాంగ్రెస్ ప్రత్యామ్నాయ రాజకీయ విజన్‌ను ప్రకటించడంపై పూర్తిగా దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉంది. మోదీని ఎదిరించే నాయకుడు రాహుల్ గాంధీ. ప్రభుత్వ చర్యలు, కార్పొరేట్లతో సాన్నిహిత్యం, ఇచ్చిన హామీల అమలులో వైఫల్యం, నిరుద్యోగం, వ్యవస్థలను హైజాక్ చేయడం, పౌర హక్కులు, స్వేచ్ఛలను హరించడం వంటివాటిని రాహుల్ ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూ వచ్చారు. ప్రభుత్వ చర్యలను విశ్లేషించడం అవసరమేగానీ రాజకీయం అక్కడికే పరిమితం కారాదు. ప్రత్యామ్నాయ రాజకీయ విజన్‌పై పార్టీ తన వైఖరిని స్పష్టంచేయాల్సి ఉంటుంది. కాంగ్రెస్ మూలాలే కాదు.. సమాజం కోసం ఏమేమి చేయగలదో కూడా ప్రజలకు చెప్పాలి. పౌరసత్వ సవరణ చట్టం వ్యతిరేకోద్యమమే ఇందుకు మంచి ఆరంభంగా చెప్పవచ్చు. యువత వేలాది సంఖ్యలో ఏకమై విషపూరిత చట్టాన్ని తిప్పికొట్టే ప్రయత్నం చేసి 'ఆజాదీ' ఎంత అవసరమో మనకు తెలియజెప్పింది. ఆజాదీ అంటే వాక్ స్వేచ్ఛ, నచ్చినట్లు ఉండటం, నచ్చింది చదవడం, నచ్చిన సంగీతం వినడం, నచ్చినట్లు జీవించడమే కాకుండా పేదరికం, నిరక్షరాస్యత నుంచి స్వేచ్ఛ కూడా ముఖ్యమే. ఆజాదీ అన్నది చాలా శక్తిమంతమైన అంశం. దీనిపై కాంగ్రెస్ నేతల దృక్పథం ఏమిటో ప్రజలకు తెలియాలి. అధికారంలోకి వస్తే సంపూర్ణ ఆజాదీపై పార్టీ ఎలాంటి వైఖరితో ఉంటుందన్నది కాంగ్రెస్ నేతలు స్పష్టం చేయాలి. మన సమాజం ఎలా ఉండబోతోంది... మనకు కావాల్సింది హిందువులు, ముస్లింలను లెక్కించడంలో అధికారులు నిమగ్నమయ్యే సమాజమా? లేక అంతా కలిసిమెలిసి జీవించే సమాజమా? మతతత్వం వల్ల మనకు ఏం జరుగుతుందన్న విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండటం మంచిది.

కాంగ్రెస్ పార్టీ సొంత చరిత్ర నుంచి పాఠాలను నేర్చుకోవాలి. కాన్పూర్ అల్లర్ల తర్వాత ఈ పార్టీ దర్యాప్తు కమిషన్‌ను ఏర్పాటు చేసి హింసకు దారితీసిన కారణాలపై విచారణ జరిపించింది. కాంగ్రెస్‌కు చెందిన ప్రముఖ నేతలు పురుషోత్తం దాస్ తాండన్, ఖ్వాజా అబ్దుల్ మజీద్, టీఏకే షేర్వాని, జరాఫుల్ ముల్క్, పండిట్ సుందర్‌లాల్, భగవాన్ దాస్ వంటివారు ఈ కమిటీలో సభ్యులుగా ఉండి నివేదికను రూపొందించారు. భారత్‌లో హిందూ-ముస్లింల చరిత్రపై రూపొందిన జాతీయవాద ప్రకటనది. భారతదేశం హిందువులు, ముస్లింలు ఇద్దరిదన్నది కాంగ్రెస్ వైఖరి. వీరిద్దరి మధ్య ఘర్షణకు ముగింపు సాధ్యమన్నది. మైనారిటీలకు మత, సంప్రదాయం, సంస్కృతి హక్కులకు సంపూర్ణ రక్షణ, స్వేచ్ఛకు భరోసా ఉండాలి. 1931 కాన్పూర్ అల్లర్ల క్రమంలో ప్రాథమిక హక్కులపై కరాచీ తీర్మానాన్ని కాంగ్రెస్ పార్టీ రూపొందించింది. మతహక్కు, మతాన్ని ఆచరించే స్వేచ్ఛకు అందులో ప్రాధాన్యత ఇచ్చింది. 1931 మార్చి 31న కరాచీ బహిరంగ సభలో ప్రాథమిక హక్కులపై తీర్మానాన్ని గాంధీ ప్రవేశపెట్టారు. 'ఇస్లామిక్, ఆర్య సంస్కృతులు పరస్పర విరుద్ధం కానప్పటికీ ముస్సల్మాన్లు ఇస్లామిక్ సంస్కృతిని ఆర్యుల కంటే విశిష్టంగా చూస్తారని మనం గుర్తించాలి. కాబట్టి సహనాన్ని పెంపొందించుకుందాం. మత తటస్థత మరొక ముఖ్య నిబంధన. స్వరాజ్యం ... ఇస్లాం కంటే హిందూమతాన్ని, హిందూమతం కంటే ఇస్లాంను ఎక్కువగా సమర్థించదు.' అన్నారు. ఇప్పుడు దేశాన్ని ఏకం చేసే లక్ష్యంతో భారత్ జోడో యాత్రకు శ్రీకారం చుడుతున్న కాంగ్రెస్ నేతలు.. ఈ నిబద్ధతను పునరుద్ఘాటించగలరా? అన్నది ప్రశ్నార్థకం. రాజ్యాంగం పని పూర్తిగా రాజ్యాంగ స్వభావంపై ఆధారపడి ఉండదు.. దానిని ఆచరణలో పెట్టేవారిపైనా ఆధారపడుతుందని 1949 నవంబరు 25న ముసాయిదా రాజ్యాంగంపై అంబేద్కర్ తన చివరి ప్రసంగంలో అన్నారు.

రాజ్యాంగ నిబంధనలు పాలక పక్షం ద్వారా విస్మరించబడ్డాయి. రాజ్యాంగం దేశంలో ప్రజాస్వామ్య స్థితిని అంచనా వేయడానికి మూల్యాంకన ప్రమాణాన్ని అందిస్తుంది. ప్రభుత్వాలు తప్పు చేసినప్పుడు - ప్రతి పౌరుడు ఇది రాజ్యాంగ ఉల్లంఘన అని గట్టిగా చెప్పగలగాలి. ప్రభుత్వాలు మనకు ఆహారం, విద్య, ఆరోగ్య సేవలు వంటివి ప్రాథమికంగా అందించాలని ప్రతి పౌరుడు చెప్పగలగాలి, ఎందుకంటే ఇది మన హక్కు. ప్రజల బాగోగులు చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. 'ఆజాదీ, మతసామరస్యం, రాజ్యాంగవాదం' అనే మూడు సూత్రాల క్రమంలో వ్యవస్థీకృతంగా ప్రజల భవిష్యత్తు ఎలా ఉంటుందన్నది కాంగ్రెస్ చెప్పగలగాలి. తమ పార్టీ తన విశాల దృక్పథాన్ని స్పష్టంచేయాలి. మీ వైఖరిని వెల్లడించాలి. అలా చేసినప్పుడే కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు నమ్మకం వచ్చేందుకు వీలుంటుంది.

విశాలాంధ్ర
3
ఆదివారం
04 సెప్టెంబర్ 2022

నేడు స్కీమ్ కార్మికుల రాష్ట్రస్థాయి సదస్సు

హాజరుకానున్న ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

విశాలాంధ్ర-కడప రూరల్: చిరుద్యోగులు, దారిద్ర్యరేఖకు దిగువనున్న ఆశా, అంగన్వాడి, మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ ఆదివారం స్థానిక వైఎస్ఆర్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జి.వేణుగోపాల్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా శనివారం తెలిపారు. ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీ ఓబులేసు హాజరవుతారన్నారు. స్కీమ్ కార్మికులకు అమ్మఒడి, చేయూత, ఆసరా మొదలైన సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. సంవత్సరాలుగా గ్రామాల్లో తల్లీబిడ్డల సంక్షేమం కోసం తమ జీవితాలను త్యాగంచేస్తున్న అంగన్వాడీలు, ఆశావర్కర్లకు నేడు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకు సంక్షేమ పథకాలు ఖచ్చితంగా వారికి వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. కరోనా సమయం నుంచి ఇప్పటివరకు కూడా స్కీమ్ కార్మికులు ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా ఉండి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సంక్షేమ పథకాలు, పోషకాహారం అందజేస్తున్న వీరికి జగనన్న బీమా, అమ్మఒడి పొందటానికి ఎందుకు అర్హత లేదని వారు ప్రశ్నించారు.

8న గరికపాటి వర్ధంతి నిర్వహించండి

ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి వ్యవస్థాపకుల్లో ఒకరైన... గరికపాటి రాజారావు 59వ వర్ధంతిని ఈనెల 8వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పిలుపునిచ్చింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చంద్రానాయక్, సిహెచ్.పెంచలయ్య శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి నిర్మాణానికి విశేషమైన సేవలు అందించి చాలా మంది కళాకారులను తీర్చిదిద్ది ఎర్రజెండా పోరాటాల్లో భాగస్వామ్యం చేసిన గొప్ప కళాకారులు, దర్శ కులు, నటులు గరికపాటి రాజారావు అని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలిపై నిర్బంధం వచ్చినప్పుడు నిర్బంధాన్ని సైతం ఎదుర్కొంటూ కళాకారులను బ్రతికించడానికి సినిమారంగం వైపు మళ్లించి సినిమా రంగంలో ఎర్ర బాటలు వేసిన ఘనుడుగా అభివర్ధిం చారు. అలాంటి మహోన్నతమైన ఆదర్శవంతమైన కళాకారున్ని స్మరించు కుంటూ 8వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున వర్ధంతి సభలు, సమావేశాలు నిర్వహించాలని కోరారు. తమ జీవితాన్ని ప్రజా చైతన్యానికి ప్రజానాట్య మండలికి అంకితం చేసిన అమర కళాకారులను స్మరించు కుంటూ, 8వ తేదీ నుంచి 14వరకు వారం రోజులపాటు అమర కళాకారుల వారోత్సవాలు జిల్లాల్లో నిర్వహించాలని పేర్కొన్నారు.

మునుగోడులో విజయం మనదే: కేసీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్: మునుగోడులో విజయం మనదేనని సీఎం కేసీఆర్ తెరాస శాసనసభాపక్ష సమావేశంలో పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో కేసీఆర్ అధ్యక్షతన తెరాస ఎల్పీ భేటీకి తెరాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు హాజరు అయ్యారు. మునుగోడులో రెండోస్థానంలో కాంగ్రెస్ మూడో స్థానం భాజపా ఉండనుందని కేసీఆర్ ఆకాంక్షించారు. మునుగోడు సర్వేలన్నీ తెరాసకే అనుకూలమని వెల్లడించారు. రెండు గ్రామాలకో ఎమ్మె ల్యేను ఇన్‌ఛార్జిగా నియమిస్తామని తెలి పారు. తెలంగాణ వజ్రోత్సవాల్లో అందరూ భాగస్వాములు కావాలి. డిసెంబర్ చివరినాటికి ప్రతి నియోజక వర్గానికి 3 వేల రెండుపడక గదుల ఇళ్లు పంపిణీ చేస్తాం. రాష్ట్ర పథకాలకు దేశ వ్యాప్తంగా ప్రశంసలు వస్తున్నాయి. బీజేపీ మాత్రం మతవిద్వేషాలు రెచ్చగొడుతూ పబ్బం గడుపుకుంటోందని కేసీఆర్ అన్నారు.

పోలవరం నిర్వాసితులకు

పునరావాసం కల్పించండి

సీఎం జగన్‌కు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం కల్పించి, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు చేసేందుకు, అనారోగ్య బాధితులకు మెరుగైన వైద్య సహాయం అందించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శనివారం లేఖ రాశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా దిగువ ప్రాంతాలన్నీ పదేపదే ముంపునకు గురవుతున్నాయనీ, ఏళ్లు గడుస్తున్నా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కావడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. పోలవరం ముంపు ప్రాంత గ్రామాల నిర్వాసితులకు ప్రభుత్వం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా, పునరావాసంగా ఇళ్లు నిర్మించి ఇవ్వకపోవడంతో నిర్వాసితులు ఏటా ఇబ్బంది లెదుర్కొంటున్నారని తెలిపారు. ఎన్నడూ లేనంతగా వరద ముంచెత్తడంతో ఈ ఏడు నిర్వాసితుల బాధలు వర్ణనా తీతమన్నారు. నేటికీ అనేక ముంపు ప్రాంతాల్లో వరద ఇబ్బందులు తగ్గలేదనీ, వరద బాధితులకు పొరుగున ఉన్న తెలంగాణ ప్రభుత్వం రూ.10 వేలు పరిహారంగా ఇస్తే, రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.2 వేలు ఇచ్చి చేతులు దులుపుకోవడం విచారకరమన్నారు.

పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంపై రాష్ట్ర ప్రభుత్వ జాప్యాన్ని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) ఎత్తిచూపింది. పీపీఏకి రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన లక్ష్యాల ప్రకారం మార్చి నుంచి ఆగస్టులోపు 12,984 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం 3,594 కుటుంబాలను మాత్రమే తరలించింది. అందులోనూ పక్షపాత వైఖరి అవలంభించడం, తమకు ఇష్టం వచ్చిన రీతిలో నచ్చినవారికి ముందుగా పునరావాసం కల్పించినట్లు ఆరోపణలొస్తున్నాయని ఆ లేఖలో రామకృష్ణ పేర్కొన్నారు.

వరద తగ్గాక పారిశుద్ధ్య పనులు కూడా నామమాత్రంగా చేయడంతో సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాలు విలీన మండలాల్లో ఊరూరా

వ్యాపించాయనీ, విలీన మండలాల్లో వైద్యులు, మందుల కొరత కారణంగా బాధితులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. కుయుగూరు గ్రామంలో కారం సంధ్య (10) అనే బాలిక జ్వరం బారినపడి మరణించింది. అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలం, పాలిపాక గ్రామంలో 17 మంది డెంగీ బారినపడడం, సకినాల వీరబాబు మృతిచెందడం విచాకరమన్నారు. నిర్వాసితులకు తగు న్యాయం చేయడంలో, వైద్య సౌకర్యాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వెలుగుచూస్తోందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి తమ సర్వస్వం ధారపోసి, భూములు, ఇళ్లు ఇచ్చిన నిర్వాసితులకు శాశ్వత పరిష్కారం చూపకుండా తాత్సారం చేయడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం చేసిన నమ్మకద్రోహం వల్ల పోలవరం నిర్మాణం మరింత జాప్యమవ్వడంతోపాటు, అంచనాలు కూడా భారీగా పెరిగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా పూర్తి బాధ్యత వహించి పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసంతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించి, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని ఆ లేఖలో రామకృష్ణ డిమాండ్ చేశారు. పోలవరం ముంపు ప్రాంతాలకు వైద్య బృందాలను పంపి, అనారోగ్య బాధితులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని కోరారు. ప్రాజెక్టు నిర్మాణ పరిపూర్తికి సమగ్ర కేంద్ర నిధులు సాధించేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలనీ, రాష్ట్ర ముఖ్యమంత్రిగా మీరు ఇప్పటికైనా స్పందించి పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని ఆ లేఖలో రామకృష్ణ కోరారు.

'మంతిని' మాస్టారుకు రాష్ట్రస్థాయి పురస్కారం

విశాలాంధ్ర-బెలగాం (పార్వతీపురం మన్యం): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ నెల 5న సీఎం జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా మంతిని వాసుదేవరావు మాస్టారు రాష్ట్రస్థాయి పురస్కారం అందుకోనున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. ఆగస్టు 10న జరిగిన జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ-2022 ఎంపికలో భాగంగా మన రాష్ట్రం నుంచి ఆరుగురు ఉపాధ్యాయులు జాతీయ జ్యూరీకి ఎంపిక కాబడ్డారు. అందులో మంతిని మాస్టారు ఒకరు. ప్రస్తుతం ఆయన మన్యం జిల్లా పార్వతీపురం మండలం డోకిశీలలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో వ్యాయామ సంచాలకులుగా పని చేస్తున్నారు. 1991లో పార్వతీపురం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ పరిధిలోని రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ పాఠశాలలో పీఈటీగా చేరి తోణాం, టిక్కబాయి, దుడ్డుకల్లులో పనిచేశారు. 2012లో సంచాలకులుగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా క్రీడా సమన్వయకర్తగా పని చేస్తున్నారు. ఈ ఏడాదిలో క్రీడా శిక్షణ శిబిరాలను 70కి పైగా నిర్వహించి జిల్లా ఉన్నతాధికారుల ప్రశంసలు పొందారు. 2003-2004లో జిల్లా ఉత్తమ పీఈటీగా ఎంపికయ్యారు. 2010లో ఆంధ్ర యూనివర్సిటీ వారు ఉత్తమ పీఈటీగా ఎంపిక చేసి సత్కరించారు. 2011లో రాష్ట్ర ఉత్తమ పీఈటీగా ఎంపికై అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నల్లా కిరణ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా సత్కారం అందుకున్నారు. మంతిని శిష్యులు రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని అనేక బహుమతులు సాధించారు. గిరిజన విద్యార్థులకు పోలీస్, ఆర్మీలో శిక్షణ ఇవ్వగా అనేకమంది ఉద్యోగాలు సాధించారు. పీఈటీ, పీడీలుగా ఉద్యోగాలు చేస్తున్నారు. రాష్ట్రస్థాయి గిరిజన క్రీడా పోటీల్లో భాగంగా 2016-17 గుంటూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి అంతర్ సొసైటీ ఛాంపియన్ షిప్, 2018-19లో విజయవాడలో నిర్వహించిన పోటీల్లో రాష్ట్ర కోఆర్డినేటర్‌గా వ్యవహరించి పార్వతీపురం ఐటీడీఏను రెండుసార్లు ఛాంపియన్‌గా నిలబెట్టారు. వాసు మాస్టారు ఎంపికపై హర్షం వ్యక్తం చేస్తూ జాతీయ స్థాయిలో కూడా వార్డు సాధించాలని చాలామంది ఆకాంక్షించారు.

రాష్ట్ర ఖజానా.. ఓట్ల కొనుగోలు పథకం

- రాష్ట్రంలో నియంతృత్వ పాలన
- ముప్పాళ్ల నాగేశ్వరరావు విమర్శ

విశాలాంధ్ర-నరసరావుపేట: రాష్ట్రంలో నియంతృత్వ పాలన కొనసాగుతోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు విమర్శించారు. నాడు చంద్ర బాబు ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటే..నేడు వైఎస్ జగన్ దుర్మార్గ పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముప్పాళ్ల మాట్లాడారు. ఉద్యోగ, విద్యా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం కష్టతరంగా మారిందని ముప్పాళ్ల అన్నారు. జగన్ దుష్ట పాలనను సరిచేయాల్సిన కేంద్ర ప్రభుత్వం... ఆయా రాష్ట్రాల్లో బీజేపీ యేతర ప్రభుత్వాలను ఎలా కూల్చాలోనన్న కుట్రలు చేస్తోందని విమర్శించారు. బుడగ జంగాలను ఎస్సీలలో చేరుస్తామన్న హామీని సీఎం జగన్ విస్మరించారని ఆగ్రహం వెలిబుచ్చారు. ఎన్నికల ముందు సీపీఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన వైసీపీ ప్రభుత్వం ఇప్పుడు మిన్నకుండి పోయిందన్నారు. అగ్రిగోల్డ్ కష్టమర్లు, ఏజెంట్ల సంఘం ఈ నెల 6వ తేదీన విజయవాడలో ఆక్రందన ప్రదర్శనకు పిలుపునిచ్చిందన్నారు. 40 లక్షల ఓట్లు గల అగ్రిగోల్డ్ బాధితులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ ఖజానాను ఓట్ల కొనుగోలు పథకంగా జగన్ మార్చారని మండిపడ్డారు. 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం.. తూర్పు గోదావరి జిల్లాలో ఆవ భూములు కేటాయించడం దారుణమన్నారు. గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాలలో రెండు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇస్తే బాగుంటుందని ముప్పాళ్ల సూచించారు. ఈ ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కరువైందని, ఇసుక మరింత ప్రియంగా మారిందని ముప్పాళ్ల తెలిపారు. ఈ నెల 14వ తేదీ నుంచి 18వ తేదీ వరకు విజయవాడలో జరిపే సీపీఐ 24వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ముప్పాళ్ల విజ్ఞప్తి చేశారు. కులం, మతం అనేవి వ్యక్తిగత అంశాలని, ఎన్నికలు, రాజకీయాలకు సంబంధం లేదని స్పష్టం చేశారు. హనుమాన్ శోభాయాత్ర పేరుతో ఆర్ఎస్ఎస్ విషం జిమ్ముతున్నదని విమర్శించారు. జగన్ ప్రభుత్వం 29 రకాల సంక్షేమ పథకాలను అటకెక్కించిందన్నారు. జాతీయ మహాసభల పోస్టర్‌ను ముప్పాళ్ల ఆవిష్కరించారు. పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతీ వరప్రసాద్, సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, బూదాల శ్రీనివాసరావు, ఉప్పలపాటి రంగయ్య, సత్యనారాయణ రాజు, సీహెచ్ నిర్మల, సుభానీ, ఎం.శ్రీనివాసరెడ్డి, నరిశెట్టి వేణుగోపాల్, ఇర్మియా, పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, రాము, పవన్ పాల్గొన్నారు.

అడ్డుకుంటే రోడ్డెక్కుతాం

- తలదించుకునే పరిస్థితి తెచ్చుకోవద్దు
- పోలీసులకు పవన్ కల్యాణ్ హితవు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడ పశ్చిమ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో జనసేన పార్టీ జెండా ఆవిష్కరణలను వైసీపీ శ్రేణులు అడ్డుకున్న తీరు వారిలోని ఓటమి భయాన్ని తేటతెల్లం చేస్తోందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. శాంతి భద్రతలకు ఇబ్బంది కలగకూడదనే సదుద్దేశంతోనే ఇంత జరుగుతున్నా తాను రోడ్డు మీదకు రాలేదని, ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రోడ్డెక్కడం తప్పదని హెచ్చరించారు. జనసేన జెండా ఆవిష్కరణ చేయకుండా వైసీపీ నేతలు, పోలీసులు అడ్డుపడడమే కాకుండా, తమ నేతలను అదుపులోకి తీసుకుని రిమాండ్ చేయడానికి చేసిన ప్రయత్నాలను తీవ్రంగా ఖండించారు. తమ జెండాలను జేసీబీతో కూల్చివేసిన వైసీపీ దౌర్జన్యకారులపై కేసు నమోదు చేయడానికి బదులు ప్రశ్నించిన జనసేన నాయకులపై కేసులు పెట్టడం ఎంతవరకు న్యాయమో పోలీస్ అధికారులు ఆలోచించాలన్నారు. జనసేన శ్రేణులు తలపెడుతున్న ప్రతి కార్యక్రమానికి అనుమతి లేదన్న సాకుతో పోలీసులు అడ్డుపడటం అధికార పార్టీకి వత్తాసు పలకడంగానే భావిస్తున్నామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. అధికార పార్టీ అన్ని కార్యక్రమాలను ముందస్తు అనుమతితోనే చేస్తున్నదా? వాడవాడల్లో వైసీపీ పెట్టిన విగ్రహాలకు, జెండా దిమ్మలకు, వారు వేస్తున్న రంగులకు ముందుగా మున్సిపల్, పంచాయతీల అనుమతి తీసుకుంటున్నారా? అన్నిటికీ అనుమతులు ఉన్నాయని పోలీసులు



ప్రకటించగలరా? అనుమతులు లేకపోతే వాటిని తొలగిస్తారా? అని పవన్ ప్రశ్నించారు. పోలీస్ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. ఈ శాసనసభ్యులు ఈ రోజు ఉంటారు.. రేపు పదవి ఊడితే ఇంటికి పోతారు. కానీ మీరు మాత్రం సర్వీస్ కాలమంతా విధుల్లోనే ఉంటారు. మరో పార్టీ ప్రభుత్వం వస్తే తలదించుకునే పరిస్థితి తెచ్చుకోవద్దు. ధర్మాన్ని పాటించాలని పోలీసు అధికారులకు హితవు పలికారు.

పిడుగుపాటుకు ఇద్దరి మృతి

విశాలాంధ్ర-వేపాడ/జామి: విజయనగరం జిల్లా వేపాడ, జామి ప్రాంతాల్లో శనివారం పిడుగు పాటుకు ఇద్దరు మృతి చెందారు. కృష్ణరాయుడిపేటకు చెందిన మురుకు రమణమ్మ (34), జామి కొత్తలివీధికి చెందిన వర్రి సత్యం(46) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళితే... కృష్ణరాయుడిపేటకు చెందిన మురుకుర్తి రమణమ్మ (34), మురుకుర్తి సునీత, బోర అర్జునమ్మ వేపాడలో తమ బంధువు అప్పొడుకు చెందిన పొలంలో (అప్పొనచెరువు దిగువున) కలుపుతీతకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో భారీ వర్షం కురిసింది. సమీపంలో ఉన్న గోకేడవారి పశువుల కల్లంలో తలదాచుకునేందుకు వస్తుండగా రమణమ్మపై పిడుగు పడింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. మిగతా ఇద్దరు ముందుగా కల్లంలోకి పరుగెత్తడంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. కాగా, మృతిరాలి భర్త లక్ష్మణ గతంలోనే మృతిచెందాడు. కుమార్తె రేవతి(12) ఏడో తరగతి చదువుతోంది. కూలీనాలీ చేస్తూ కుమార్తెను చదివించుకుంటోంది. తహసీల్దార్ ఎస్.కృష్ణంరాజు, వల్లంపూడి ఎస్సై కె.రాజేష్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని రమణమ్మ మృతదేహాన్ని పరిశీలించి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. మృతురాలి అక్క అర్జునమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మి, వీఆర్ఓ బాల భాస్కర్ ఉన్నారు.

ఇదిలా ఉండగా, జామి కొత్తలివీధికి చెందిన రైతు వర్రి సత్యం(46) తన భార్య రమణమ్మతో కలిసి నేరెళ్ళ చెరువు సమీపంలోని తన పొలంలో కలుపు తీస్తుండగా ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. అతి దగ్గరలో పిడుగు పడడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. సమీపంలో ఉన్న వారు వెళ్లి చూడగా సత్యం అప్పటికే మృతి చెందాడు. భార్య రమణమ్మ మూర్ఛపోయింది. వెంటనే ఆమెను జామిలోని ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు. సమాచారం అందుకున్న వెంటనే తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు.

మైనారిటీల సంక్షేమానికి వెనుకాడం: కిషోర్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ముస్లిం, మైనారిటీల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని, వారి సంక్షేమం కోసం ఎన్ని నిధులైనా ఖర్చు చేయడం కోసం ముఖ్యమంత్రి సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర మైనారిటీ సంక్షేమశాఖ డైరెక్టర్ డా.జి.సి. కిషోర్ కుమార్ వెల్లడించారు. భవానీపురం(హౌసింగ్ బోర్డు కాలనీ, మాళవిక విల్లా)లోని ఏపీ స్టేట్ ఉర్దూ అకాడమీ కాన్ఫరెన్స్ హాల్‌లో మైనారిటీ శాఖ ఆధ్వర్యంలో శనివారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన వివిధ అంశాలపై సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కిషోర్ కుమార్ మాట్లాడుతూ వివిధ సంక్షేమ పథకాలద్వారా అర్హులైన పేద, మైనారిటీలను ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. మైనారిటీల నవరత్నాల అమలుకు భారీగా నిధులు వెచ్చించిందన్నారు. మైనారిటీల సంక్షేమం, సమృద్ధి, వారి జీవితంలో ఆనందం నింపడం కోసం కొత్త ప్రతిపాదనలు ఏవైనా తీసుకువస్తే వాటిని పరిశీలించి త్వరలో మైనారిటీల శ్రేయస్సు కోసం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడానికి ముఖ్యమంత్రి అనుకూలంగా ఉన్నారన్నారు. ప్రధానంగా కొత్త పథకాలతో పాటు కొత్తగా ప్రొఫెషనల్ హబ్స్, మైనారిటీలోని ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహకాలు, మైనారిటీ స్కూళ్లు, రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీలు, ఐటీఐ, పాలిటెక్నిక్ తదితర వసతుల కల్పనకు ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. ఇప్పటికే ప్రభుత్వ సహకారంతో మైనారిటీలకు సంబంధించి రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న పునర్నిర్మాణ అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా మైనారిటీ శాఖ పనితీరుపై జిల్లాల వారీగా అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాల అమలు తీరుపై క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు పరిశీలన జరగాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్క మైనారిటీకి ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయాలన్నారు. ఇప్పటికే నాలుగైదు దఫాలుగా మైనారిటీ సంక్షేమ శాఖపై సీఎం చర్చించారని త్వరలోనే మరోసారి మైనారిటీ సంక్షేమ శాఖ పనితీరుపై చర్చించే అవకాశముందన్నారు. ప్రధాన మంత్రి జన వికాస్ కార్యక్రమంలో భాగంగా ముస్లిం, మైనారిటీలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అధిక దృష్టి కేంద్రీకరించి ఆయా ప్రాంతాల్లో విద్యాసంస్థల ఏర్పాటుకానీ, కమ్యూనిటీ హాల్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్స్, హెల్త్ సెక్టార్ నిర్మాణాలను నిర్మించుకునే అవకాశం ఉందని సూచించారు. సమీక్షా సమావేశం చివర్లో మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మైనారిటీల కోసం అమలు చేస్తున్న ప్రీమెట్రిక్, పోస్ట్ మెట్రిక్, మెరిట్ కమ్ మీన్స్ ఆధారిత స్కాలర్‌షిప్‌లను తెలిపే పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సమావేశంలో వక్ఫ్ బోర్డు సీఈవో, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ ఖదీర్, సర్వే కమిషనర్ ఆఫ్ వక్ఫ్ షేక్ షీరిన్ బేగం, దూదేకుల నూర్ బాషా ఫెడరేషన్ ఎం.డి డా.మహ్మద్ మస్తాన్, సీఈడీఎం డైరెక్టర్ మహ్మద్ మస్తాన్ వలీ, క్రిస్టియన్ కార్పొరేషన్ ఎండీ ఎలీషా, 26 జిల్లాల మైనారిటీ సంక్షేమ అధికారులు, యూనిట్ అధికారులు, రాష్ట్ర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సెప్టెంబర్ 17... జాతీయ సమైక్యతా దినం

- రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజులు ఉత్సవాలు
- జీహెచ్ఎంసీ కోఆప్షన్ సభ్యుల సంఖ్య పెంపు
- నీటిశుద్ధికి రూ.2214.79 కోట్లు
- తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు

విశాలాంధ్ర-హైదరాబాద్: రాచరికం నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థలోకి మారి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా తెలంగాణ జాతీయ సమైక్యతా వజ్రోత్సవాలు ఘనంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అధ్యక్షతన ప్రగతిభవన్‌లో శనివారం జరిగిన మంత్రివర్గ సమావేశం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నది. ఈ నెల 16, 17, 18 తేదీల్లో తెలంగాణ జాతీయ సమైక్యతా వజ్రోత్సవాలు నిర్వహించాలని, సెప్టెంబరు 17ను జాతీయ సమైక్యతా దినంగా పాటిస్తామని కేబినెట్ తెలిపింది. కేబినెట్ నిర్ణయం మేరకు తెలంగాణ వ్యాప్తంగా జాతీయ సమైక్యతా వజ్రోత్సవాలు మూడు రోజులు జరుగుతాయి. రాష్ట్ర కేబినెట్ అనేక కీలక నిర్ణయాలు తీసుకుంది. సెప్టెంబర్ 16వ తేదీన రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో విద్యార్థులు, యువతీ యువకులు, మహిళలతో భారీ ర్యాలీలు నిర్వహించాలని నిర్ణయించింది. 17న సీఎం కేసీఆర్ పబ్లిక్ గార్డెన్స్‌లో జాతీయ జెండా ఆవిష్కరించి..ప్రసంగిస్తారు. అదే రోజు అన్ని జిల్లా కేంద్రాల్లో మంత్రులు, మున్సిపాలిటీ, పంచాయతీ కేంద్రాల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు జాతీయ జెండా ఆవిష్కరిస్తారు. అదే రోజు మధ్యాహ్నం బంజారా ఆదివాసీ భవన్ ప్రారంభోత్సవం, నక్లెస్ రోడ్డు నుంచి అంబేద్కర్ విగ్రహం మీదుగా ఎన్టీఆర్ స్టేడియం వరకు భారీ ప్రదర్శన నిర్వహిస్తారు. అక్కడ జరిగే బహిరంగ సభలో కేసీఆర్ ప్రసంగిస్తారు. సెప్టెంబర్ 18న అన్ని జిల్లా కేంద్రాల్లో స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానాలు, కవులు, కళాకారులను గుర్తించి సత్కారం, తెలంగాణ స్ఫూర్తిని చాటేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నది.

పోడు భూముల విషయం...

పోడు భూముల విషయంపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించింది. గిరిజనుల పోడు భూముల సమస్య పరిష్కారానికి రెవెన్యూ, అటవీ, గిరిజన సంక్షేమ శాఖల అధ్వర్యంలో ఆయా జిల్లాల మంత్రుల ఆధ్వర్యంలో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చర్యలు చేపట్టాలని సూచించింది. జీహెచ్ఎంసీ, మున్సిపల్ కార్పొరేషన్లలో కో ఆప్షన్ సభ్యుల సంఖ్య పెంచాలని కేబినెట్ నిర్ణయించింది. జీహెచ్ఎంసీలో 5 నుండి 15 వరకు, ఇతర కార్పొరేషన్లలో 5 నుండి 10 వరకు కో ఆప్షన్ సభ్యుల సంఖ్యను పెంచాలని తీర్మానించింది. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ఫారెస్టు యూనివర్సిటీకి కొత్త పోస్టులు మంజూరు చేయాలని కేబినెట్ తీర్మానించింది. సుంకిశాల నుంచి హైదరాబాద్ నగరానికి నీటి సరఫరా వ్యవస్థను మెరుగు పరచాలని నిర్ణయించింది. అందులో భాగంగా అదనంగా 33 టీఎంసీల నీటిని శుద్ధిచేసి సరఫరా చేయనుంది. అందుకుగాను రూ.2214.79 కోట్లు మంజూరు చేయాలని తీర్మానం చేసింది. జిల్లా కోర్టు భవనాల నిర్మాణం కోసం 21 జిల్లా కేంద్రాల్లో స్థలాలు కేటాయించాలని నిర్ణయించింది. భద్రాచలం ముంపు ప్రాంతాల్లో 2016 కుటుంబాలకు నూతనంగా కాలనీలు నిర్మించాలని తీర్మానించింది.

దళిత బంధు విస్తరణ...

దళిత బంధును ప్రతి విస్తరించాలని కేబినెట్ నిర్ణయించింది. ప్రస్తుతం ప్రతి నియోజకవర్గంలో 100 మందికి దళితబంధు అందజేస్తున్నారు. దీనిని 500 మందికి విస్తరించాలని అభిప్రాయపడింది. హుజూరాబాద్ నియోజకవర్గంలో పూర్తిగా అమలుచేస్తున్నందున...మిగిలిన 118 నియోజకవర్గాలకుగాను ప్రతి నియోజకవర్గానికి 500 మంది అర్హులైన లబ్ధిదారులను గుర్తించి దళిత బంధు పథకాన్ని అమలు చేయాలని తీర్మానించింది. లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది.

సంపాదకీయం

ఎన్నికల్లేకపోతే జనం పస్తే

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చాలా దూరదృష్టి ఉన్న వ్యక్తి. ఆయన నోటి వెంట ఏ మాటైనా వెలువడితే దాని ప్రభావం ఏదో ఒక చోట ఎప్పుడో ఒకప్పుడు కచ్చితంగా కనిపించి తీరుతుంది. పైగా ఆయన మాటల గురి ఒక వేపు లక్ష్యం మరో వేపూ ఉండొచ్చు. ఇటీవల ఆయన రేవడీలు (ఉచితాలు, తాయిలాలు) ఎంత అపకారం చేస్తాయో చెప్పారు. ఆయన ఈ మాట అన్న రాజకీయ సందర్భాన్ని బట్టి చూస్తే గుజరాత్ లాంటి రాష్ట్రాలలో కాలు మోప డానికి ప్రయత్నిస్తున్న ఢిల్లీ ముఖ్యంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించే ఉచితాల మీద దాడి చేస్తున్నట్టు కనిపించి ఉండవచ్చు. కానీ ఉచితాలవల్ల అనర్థం అన్న మోదీ మాట ప్రభావం ఈ నెల నుంచి ఉత్తర ప్రదేశ్‌లోని 15 కోట్ల మంది ప్రజల మీద పడబోతోంది. ఇప్పటిదాకా ఆ రాష్ట్రంలో రేషన్ కార్డులున్న కుటుంబాలకు గోధుమలు, బియ్యం ఉచితంగా దొరికేవి. కరోనా మహమ్మారి కాటేసిన కాలంలో ఉచితంగా ఆహార ధాన్యాలు సరఫరా చేసే విధానం అమలులోకి వచ్చింది. కరోనా తగ్గుముఖం పట్టిన తరవాత ఈ ఉచిత ఆహార ధాన్యాల సరఫరాకు స్వస్తి చెప్పాలనుకున్నారు. కానీ గత ఫిబ్రవరి–మార్చిలో శాసన సభ ఎన్నికలు ఉన్నందువల్ల ఈ గడువు పొడిగించారు. వచ్చే నెల నుంచి అయిదు కిలోల ఆహార ధాన్యాల ఉచిత పంపిణీ ఆగిపోతుంది. ఉచితంగా గోధుమలు, బియ్యం సరఫరా చేయడం ఆగస్టు నుంచి నిలిపి వేయాలని నిర్ణయించారు. ఆగస్టు నెల రేషన్ సెప్టెంబర్‌లో అందుతుంది. ఇక మీద రేషన్ కార్డులున్న వారు కిలో గోధుమలు రెండు రూపాయలు, కిలో బియ్యం మూడు రూపాయలు ఇచ్చి కొనాల్సిందే. బియ్యం, గోధుమల ఉచిత సరఫరా ఆపివేసినా నెలకు ఒక లీటర్ వంట నూనె, కిలో ఉప్పు, కిలో శెనగలు మాత్రం ఉచితంగానే అందిస్తారట. ఉత్తరప్రదేశ్‌లో రేషన్ కార్డులు ఉన్న కుటుంబాలు 3 కోట్ల 60 లక్షల మంది. వీరిలో అంత్యోదయ పథకం కిందకు వచ్చే కుటుంబాలు దాదాపు మూడు కోట్లు ఉంటాయి. స్థిరమైన ఆదాయం లేని కుటుంబాలకు అంత్యోదయ రేషన్ కార్డులు ఇస్తారు. అంటే నిరు పేదలకు ఈ సదుపాయం ఉంటుంది. అంత్యోదయ పథకం కింద రేషన్ కార్డు ఉన్న వారికి నెలకు కిలో రెండు రూపాయల చొప్పున 14 కిలోల గోధుమలు, కిలో మూడు రూపాయల చొప్పున 21 కిలోల బియ్యం అందుతాయి. మామూలు రేషన్ కార్డులున్న వారికి కిలో రెండు రూపాయల చొప్పున రెండు కిలోల గోధుమలు, కిలో మూడు రూపాయల చొప్పున మూడు కిలోల బియ్యం అందుతాయి. ఉచిత రేషన్ సరఫరా నిలిపివేసి నందువల్ల ఎక్కువగా ఇబ్బంది పడేది రోజు కూలీలే. కరోనా కష్ట కాలంలో, ఎన్నికల పుణ్యమా అని ఉచిత రేషన్ అందినందువల్ల చాలా కుటుంబాలు బతుకు వెళ్లదీయడం కొంతైనా సులభం అయింది. కరోనా సమయంలో ఉపాధి కోల్పోయిన వారిలో చాలా మందికి మళ్లీ పని దొరకడమే లేదు. ఇలాంటి వారు ఉచిత రేషన్ ఆగిపోయినందువల్ల ఇబ్బంది పడవలసి వస్తుంది. ఉపాధి లేనందువల్ల ఆదాయం ఉండదు కనక తక్కువ ధరకే అయినా రేషన్ దుకాణంలో ఆహార ధ్యాన్యాలు కొనగలిగే పరిస్థితి లేదు.

మరో వేపు అతివృష్టి, అనావృష్టి రెండూ రైతులను కోలుకోలేని దెబ్బ తీశాయి. కొన్ని చోట్ల వరదలు ముంచెత్తి, మరి కొన్ని చోట్ల అనావృష్టివల్ల పంటలు చేతికి అందలేదు. అలాంటి పరిస్థితిలో ఉన్న రైతుల మనుగడ కూడా ఉచిత రేషన్ ఆగిపోతే దుర్లభమే అవుతుంది. నిజానికి 2021 జులై ఆఖరుకల్లా ఉచిత ఆహార ధాన్యాల సరఫరా నిలిపి వేయాలని యోగీ ఆదిత్యనాథ్ ప్రభుత్వం భావించినా ఆ ప్రతిపాదన వెనక్కు తీసుకున్నారు. ప్రకృతి వైపరీత్యాలవల్ల పంట నష్టం జరిగింది కనక, కరోనా సమయంలో కోల్పోయిన ఉపాధి అనేక మందికి ఇప్పటికీ మళ్లీ దొరకలేదు కనక ఉచిత ఆహార ధాన్యాల సరఫరా కొనసాగిస్తే సముచితంగా ఉండేది. ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రభావితం చేయడానికి ప్రయోగించిన చిట్కాలు ఎల్ల కాలం కొనసాగవుగదా. మోదీ హయాంలో ఓట్లు రాల్చని ఏ పథకమూ ప్రజాప్రయోజనం కోసం నిరంతరంగా సాగదు. ఏ ప్రభుత్వం ఎవరికైనా ఏ సదుపాయమైనా ఉచితంగానో, తక్కువ ధరకో అందిస్తోంది అంటే దానికి రెండు కారణాలు ఉంటాయి. ఒకటి ఆ పథకంవల్ల ఓట్లు రాలాలి. ప్రజలను ఆకర్షించి ఓట్లు రాబట్టడానికి ఉపకరించాలి. కనీసం తమది జన సంక్షేమానికి కట్టుబడి ఉందన్న భ్రమైనా కల్పించగలగాలి. ఉత్తరప్రదేశ్‌లో ఇప్పట్లో ఎన్నికలు లేవు. రెండవసారి వరసగా బీజేపీ అధికారంలోకి వచ్చిన తరుణంలో ఇక ఓటర్లతో పనేముంటుంది? సంక్షేమ రాజ్యం, ప్రజా సంక్షేమం అన్న మాటలను రాజకీయ పార్టీలు ఎప్పుడూ ఎన్నికలలో ప్రయోజనం పొందడానికే వాడుతుంటాయి. ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉన్నా ఇదే దుస్థితి కొనసాగుతోంది. ప్రభుత్వాలు ఉచితంగానో, సబ్సిడీ ధరకో తక్కువ ధరకో అందించినా దానివల్ల జనం పరిస్థితి మెరుగు పడడానికి దోహదం చేయాలి. ప్రజలు వాళ్ల సొంతకాళ్ల మీద నిలబడడానికి ఇలాంటి పథకాలు కొంతకాలం ఊతకర్రల్లా మాత్రమే ఉపయోగపడాలి. కానీ ప్రభుత్వాలు రూపొందించే ఏ సంక్షేమ పథకమైనా రాజకీయ లబ్ధి లక్ష్యంగానే ఉంటుంది తప్ప అసలైన జనాభ్యుదయానికి లేశమంత కూడా ఉపకరించదు. ప్రజల పరిస్థితి మారనంత కాలం ఉచితాల కోసం నోరు తెరుచుకుని ఎదురు చూడడమూ ఆగదు. ఇలాంటి పథకాల ఆధారంగా స్వావలంబన సాధించామన్న భరోసా గత ఏడున్నర దశాబ్దాలుగా ఎన్నడూ కలగనేలేదు. ప్రజల ఆర్థిక స్థితి మారకపోగా ఆత్మాభిమానం కూడగట్టుకునే అవకాశమే రాలేదు. దీన్నిబట్టి ప్రభుత్వ సంక్షేమ పథకాలను రూపొందించడంలోనే మౌలికమైన లోపం ఉందనిపిస్తోంది. ఊతకర్రల అవసరం శాశ్వతంగా ప్రజలకు ఉండకూడదు. కానీ అవి అనవసరమయ్యే రూపంలో ప్రభుత్వాలు వాటిని తయారు చేయవు. ప్రజలు ప్రభుత్వం మీద ఆధారపడి బతికే అవసరం ఉన్నన్నాళ్లే తమ వాగ్దానాలకు చెలామణి ఉంటుందని రాజకీయ పార్టీలు భావిస్తాయి. అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల కోసం దశాబ్దాల తరబడి ప్రభుత్వ ఖజానా నుంచి పెడుతున్న ఖర్చు తాత్కాలిక ఉపశమనానికి మాత్రమే పనికి వస్తోంది. ఆ సహాయం అవసరమైన వారు నిలదొక్కుకోవడానికి, ఆ తరవాత స్వయం శక్తి మీద నిలబడడానికి ఏ మాత్రం ఉపకరించడం లేదు. జన జీవనం మెరుగుపడాలన్న భావన ప్రభుత్వాలకు, రాజకీయ పార్టీలకు ఉంటే ఈ పరిస్థితి దాపురించేది కాదు. ఉచితాలు ఓట్లు లాగ డానికి ఎరగా వాడుకోవడం మినహా మరో లక్ష్యం లేనంత కాలం సంక్షేమం అసాధ్యమే.

ఆదర్శనీయుడు కొమ్మాలపాటి

పొట్టి నాగమల్లేశ్వరరావు

కామ్రేడ్ కొమ్మాలపాటి అప్పారావు గుంటూరు జిల్లా భారత కమ్యూనిస్టు పార్టీలో సీనియర్ నాయకులు. ఈ ప్రాంత ప్రజలందరికీ సుపరిచితులు. ఆయనది ఆదర్శ ప్రాయమైన జీవన శైలి. లక్ష్మయ్య, కోటమ్మ దంపతులకు కొమ్మాలపాటి అప్పారావు 28 మే 1930న నాటి గుంటూరు జిల్లా లోని పెద్దకూరపాడులో జన్మించారు. వీరిది మధ్య తరగతికి చెందిన రైతు కుటుంబం. ఐదుగురు సంతానంలో మొదటివాడు. 11వ ఏటనే తండ్రి చని పోయారు. ఫోర్తు ఫారం వరకు అమరావతిలో చదివారు. అనంతరం స్వగ్రామంలో స్వాతంత్ర్య సమరయోధులు, కమ్యూనిస్టు నాయకులు కామ్రేడ్ దర్శి లక్ష్మయ్య కృషి పట్టుదలతో నూతనంగా స్థాపించిన జిల్లాబోర్డు హైస్కూ ల్‌లో ఎస్.ఎస్.ఎల్.సి మొదటి బ్యాచ్‌లో చేరారు. ఆ రోజుల్లో కామ్రేడ్ దర్శి లక్ష్మయ్య నాయకత్వంలో జరిగిన పోరాటాలలో పాల్గొని స్ఫూర్తిని పొందారు. విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితులయ్యారు. అయితే అప్పట్లో కమ్యూనిస్టు పార్టీ, దాని అనుబంధ సంస్థలపై ప్రభుత్వ నిషేధం ఉంది. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐ ఎస్‌ఎఫ్) కూడా నిషేధానికి గురయ్యింది. కానీ విద్యార్థి సమాఖ్య మహాసభని కొండవీడు కొండలలో నిర్వ హించడానికి నిర్ణయం తీసుకుంది. ఆ మహాసభ కోసం రహస్యంగా విద్యా ర్థుల్ని సమీకరిస్తున్నాడనే కారణం జూపి అప్పారావును ఎస్.ఎస్.ఎల్.సి ఫైనల్ పరీక్షలకు హాజరు కాకుండా పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. ఆయన చదువు అక్కడితో ఆగిపోయింది.

కొద్ది రోజులు గ్రామంలో ట్యూషన్లు చెప్పారు. పుస్తకాలు కొనడం అన్నా, చదవటం అన్నా అమితమైన ఇష్టం. మార్క్సిస్టు సాహిత్యంతోపాటు తెలుగు సాహిత్యం, ఆయుర్వేద శాస్త్రం కూడా అధ్యయనం చేశారు. అనంతర కాలంలో విజయవాడలో సినిమా ఫిలిం పంపిణీ సంస్థలో ఉద్యోగంలో చేరారు. 21వ ఏట తెనాలి తాలూకా కంచర్లపాలెం గ్రామినికి చెందిన గాలి రాఘవయ్య పెద్దమ్మాయి మంగమ్మతో వివాహం జరిగింది. కమ్యూనిస్టు నాయకులు, భావసారుప్యతగల మిత్రులు పెద్దల సమక్షంలో దండలు మార్చుకొని ఆదర్శ వివాహం చేసుకున్నారు.

1960వ దశకంలో స్వగ్రామం పెద్దకూరపాడుకు విద్యుత్ సాధనకై కృషి చేశారు. విద్యుత్ సౌకర్యం కోసం ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ. 6,000 లు ప్రజల వంతుగా చెల్లించాలి. ఆ మొత్తాన్ని తానే స్వయంగా చెల్లించారు. పెద్దకూరపాడు గ్రామం విద్యుత్ సౌకర్యం పొందటంలో కీలకంగా నిలిచారు. 1965లో మిత్రులతో కలిసి టూరింగ్ టాకీసు నిర్మించారు. అనంతరం కొద్దికాలంలోనే దానిని పర్మినెంట్ థియేటర్‌గా మార్చడానికి కొని సిద్ధం చేసుకున్న ఇసుక, సిమెంటు, ఇటుకలను గ్రామంలోని ఎస్సీ కాలనీ నిర్మాణానికి అందించారు. కొన్ని పదుల దళిత కుటుంబాలకు నీడను కల్పించడంలో ప్రముఖంగా నిలిచారు. తాను నిర్వహించిన సినిమాహాళ్ళలో బలహీన వర్గాల వారికి ఉద్యోగావకాశాలు కల్పించేవారు.

1970వ దశకంలో గ్రామ పెద్దలతో కలిసి పెద్దకూరపాడు గ్రామాభ్యుదయ సమితిని స్థాపించి, తాలూకా సాధనకై విశేష కృషి చేశారు. 1970–80లలో ప్రభుత్వ జూనియర్ కాలేజి, పశు వైద్యశాలల డిమాండుతో గ్రామ యువకులు జరిపిన పోరాటాలను ప్రోత్సహించారు. ఉద్యమాల ఫలితంగా పెద్దకూరపాడు మండలానికి ప్రభుత్వ వైద్యశాల వచ్చింది. గ్రామంలో రెండు వర్గాల మధ్య జరిగిన విద్వేష దాడుల నేపథ్యంలో వాటి నివారణ కోసం, శాంతి స్థాపన కోసం విశేష కృషి చేశారు. కమ్యూనిస్టు చైతన్యాన్ని ఆచరణలో చూపారు.

వ్యాపారం దెబ్బతిని, ఆర్థిక ఇబ్బందులొచ్చినా నిరుత్సాహపడలేదు. ఉమ్మడి సత్తెనపల్లి తాలూకా రైతు సంఘం కార్యదర్శిగా పనిచేశారు. కమ్యూనిస్టు పార్టీ గుంటూరు జిల్లా సమితి సభ్యులుగా దీర్ఘకాలం పనిచేశారు. 2001వ సంవత్సరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎడమ కాలుని కోల్పోయారు. అయితే ఎప్పుడూ ధైర్యాన్ని ఆత్మ నిబ్బరాన్ని కోల్పోలేదు. అనంతరం కృష్ణా జిల్లా, కొండపల్లిలో, తాడిగడపలో ఆ తర్వాత స్వగ్రామంలో ఆయుర్వేద మందుల దుకాణం నిర్వహించారు. బాలికల చదువుని ప్రోత్సహించేవారు. మహిళాభ్యుదయం అయినా, సాధికారిత అయినా విద్య ద్వారానే అని నమ్మినవారు. ఎప్పుడూ తెల్లటి చేనేత దుస్తులు ధరించేవారు.

కుమార్తె పేరు మీద 'శారద నిలయం' అని పుస్తక భాండాగారం ఉండేది. వీరి కుమారుడు శరచ్చంద్ర జ్యోతిశ్రీ పత్రికారంగంలో పనిచేశారు. ప్రస్తుతం అభ్యుదయ రచయితల సంఘం (అరసం)లో క్రియాశీల కార్యకర్తగా ఉన్నారు. ఆయన కుమారుని మిత్రులు అప్పారావును కామ్రేడ్ అని, పెద్దాయన అని, భారతీయుడు అని ప్రేమగా, గౌరవంగా పిలుస్తుంటారు. అప్పారావు చిన్న తమ్ముని కుమారుడు కొమ్మాలపాటి శ్రీధర్ గతంలో రెండు పర్యాయాలు పెద్దకూరపాడు నియోజకవర్గానికి శాసన సభ్యులుగా ప్రాతినిధ్యం వహించారు.

23 ఆగస్టు 2022న కామ్రేడ్ కొమ్మాలపాటి అప్పారావు తుదిశ్వాస విడిచారు. ఆయన మరణంతో భారత కమ్యూనిస్టు పార్టీ నిబద్ధతతో జీవనం సాగించిన ఓ సీనియర్‌ని, మంచి కమ్యూనిస్టుని కోల్పోయింది.

(నేడు పెద్దకూరపాడులో కామ్రేడ్ అప్పారావు సంస్మరణ సభ సందర్భంగా)

వ్యాస రచయిత సెల్ 9885214010

ప్రపంచ దేశాల మధ్య సఖ్యత అవశ్యం

సంగిరెడ్డి హనుమంతరెడ్డి

ప్రపంచం ప్రమాదకర భౌగోళిక రాజకీయ మాంద్యంలోకి ప్రవేశిస్తోంది. ఆర్థికవ్యవస్థ లాగే, భౌగోళిక రాజకీయం ఎగుడు దిగుళ్ళలో ఉంది. కోవిడ్ విశ్వమహమ్మారితో సమస్య తీవ్రతరం, శీఘ్రతరం అయింది. ప్రపంచం పతన దిశలో ఉంది. విశ్వమహమ్మారితోనే కాక ఇతర కారణాలతోనూ దిశ మారింది. అర్థవంతమైన, నిర్మాణాత్మక మౌఖిక చర్చలకు, కలిసి పనిచేయడానికి అవకాశాలు తగ్గాయి. ప్రపంచ ప్రధాన శక్తుల మధ్య సఖ్యత లేకుంటే ఏ సమస్యా పరిష్కారం కాదు. చైనా, అమెరికా, రష్యాలు చర్చించాలి. మిగతా దేశాలూ భిన్నాభిప్రాయాలను అధిగమించి పరస్పర సహకార మార్గాలను వెతకాలి. ఉమ్మడి ప్రయోజనాల కోసం ప్రపంచం సామరస్యపూర్వకంగా కలిసి పనిచేయకుంటే, నేటి భౌగోళిక రాజకీయ మాంద్యం అన్ని దేశాలకు పెనుముప్పు కలిగిస్తుంది. ప్రపంచవ్యాప్త శాంతినిర్వహణలో ఐక్యరాజ్యసమితి (ఐరాస)సామర్థ్యాన్ని కోవిడ్ తీవ్రంగా దెబ్బ తీసింది. విశ్వమహమ్మారి ప్రారంభ దశలో 2020 మే–జులైల మధ్య సహకరించే దేశాల నుండి సైనిక దళాలు, పోలీసుల భ్రమణాన్ని స్తంభింపచేసింది. ఐరాస తన పనిని ప్రాథమిక వాస్తవానుగుణంగా మార్చుకోవల్సి వచ్చింది. పోలీసు అధికారులు, సైనికులు, పౌర శాంతిపరిరక్షకులు సామాజిక ఏకాకులై పని చేయాల్సి వచ్చింది. చాలా దేశాల్లో సామాజిక దూరం కొనసాగుతోంది. విశ్వ మహమ్మారి–ప్రేరిత ప్రపంచ మాంద్యం, దాని ప్రభావాలు ఐరాస శాంతి కార్యకలాపాలపై ఆర్థిక పరిధిని గీశాయి. శాంతి పరిరక్షణ బడ్జెట్ 800 నుండి 600 కోట్ల డాలర్లకు తగ్గింది. పదేళ్లలో బహుపాక్షికత వివాదం, ప్రధాన శక్తుల మధ్య శత్రుత్వం పెరగవచ్చు. ఐరాసభద్రతా మండలి కొత్త శాంతి పరిరక్షక కార్యకలాపాలకు అధికారం ఇచ్చే అవకాశాలను చూడవలసి ఉంటుంది. అప్పటికి అంతర్జాతీయ వ్యవస్థ మరింత ఏకీకృత కొత్త ప్రపంచ క్రమానికి సర్దుకుంటుంది. శాంతి–నిర్మాణంలో అంతర్జాతీయ సమాజం పాత్ర గురించి నూతన ప్రపంచ అవగాహన ఏర్పడుతుంది.

కొత్త బహుపాక్షిక రూపాలు మరిన్ని దేశాలకు ప్రయోజనం చేకూరుస్తాయి. బహుపాక్షికత కొత్త రూపాల అన్వేషణలో ఐరాసకీలక పాత్ర పోషిస్తుంది. ఐరాస బహుపాక్షికత మధ్య సమతుల్యతను సాధించాలి. సార్వత్రిక నియమాలను నిర్వచించాలి. ఏకాభిప్రాయాన్ని చేరుకోలేనప్పుడు ఎజెండాను ముందుకు తీసుకెళ్లడానికి ఎక్కువ సౌలభ్యాన్ని అందించేది బహు పాక్షికత. ప్రాథమిక సూత్రాలను నిర్ధారిస్తూ ప్రతినిధులు, జవాబుదారీ మధ్యవర్తి సంస్థలు నిష్పక్షపాతంగా అమలు చేయగల ఆమోదిత చట్టబద్ధ సాధారణ నియమాల సమితిని రూపొందించాలి. 1. ప్రపంచ దేశాలు ఇతరులకు హాని కలిగించడం, "నీ పొరుగువాడు బిక్షగాడు" విధానాలను మానాలి. 2. దేశాలు సైబర్, ఆర్థిక, ఆర్థికేతర రంగాల్లో తమ హద్దులను నిర్ధారించుకోవాలి. 3. వాతావరణ, పర్యావరణ మార్పులతో సహా అనేక సమస్యలపై ప్రపంచ దేశాలు సామాన్యులకు సమర్థవంతంగా సహకరించాలి. 4. ప్రజావస్తువుల ఉత్పత్తికి దేశాలు సహకారాన్ని పెంచుకోవాలి. 5. దేశాలు ప్రపంచ ఆర్థిక వృద్ధి, అభివృద్ధిని ప్రోత్సహించాలి. ప్రపంచ సమస్యలను కలిసి పరిష్కరించుకోవాలి.

సంస్థాగత వైవిధ్యం, ఆమోదించిన బహు పాక్షికతల కొత్త ఒప్పందానికి పునాది వేసే సూత్రాల సమితిని అభివృద్ధి చేయడంలో ఐరాస ప్రధాన పాత్ర పోషించాలి. బహుపాక్షిక ప్రయత్నాల్లో భాగంగా, జాతీయ, బహుపాక్షిక లక్ష్యాలను ఏకీకృతం చేయడంలో ముఖ్యపాత్రను పోషిస్తూనే,ప్రజల శ్రేయస్సును ప్రోత్సహించాలి. ప్రపంచానికి సమ్మిళిత విధానం అవసరం. ప్రపంచం కొత్త ప్రపంచ క్రమం, ప్రపంచ పాలన నిర్మాణాన్ని స్థాపించే దశలో ఉంది. రాజకీయ, సైనిక సమూహాలు అమలులో ఉన్న ప్రపంచ క్రమాన్ని క్షీణింపజేశాయి. ప్రపంచ పాలనా వ్యవస్థను విభజించి, విచ్ఛిన్నం చేశాయి. ఈ పరిస్థితులలో, ప్రపంచ పాలనా క్రమ పునర్నిర్మాణం ప్రాముఖ్యతను సంతరించుకుంది. ప్రపంచ సమూహాల ప్రాథమిక నియమాలు, వివిధ రంగాలను నియంత్రించే "అనువర్తన–ఆధారిత" నిర్దిష్ట నియమాలతో కొత్త ప్రపంచ పాలనా వ్యవస్థపై ఏకాభిప్రాయం సాధించాలి. ప్రాథమిక నియమాలు, సాధారణ, విస్తృత ఆమోదిత సూత్రాలు, విధి విధానాలు, ఐరాస సూత్రాలను చాలా దేశాలు నిర్లక్ష్యం చేశాయి. అంతర్జాతీయ సంస్థలపై అమెరికా పెత్తనం చలాయిస్తోంది.

విశ్వ మహమ్మారి అనంతర ప్రపంచ ఆర్థిక పునరుద్ధరణ అసమతుల్యమైంది. అభివృద్ధి చెందుతున్న దేశాలు, ముఖ్యంగా తక్కువ – అభివృద్ధి చెందిన దేశాలు కరువు, ఆర్థిక శరణార్థుల సంక్షోభాలను ఎదుర్కొంటున్నాయి. ఇది వారి అభివృద్ధిని అడ్డుకోవచ్చు. కాబట్టి ప్రపంచం అభివృద్ధి లోటును ఎదుర్కోవాలి. ఉమ్మడి ప్రయోజన సూత్రాన్ని సమర్థిస్తూ సహ–అభివృద్ధిని ప్రోత్సహించాలి. ఈ విషయంలో, వివిధ దేశాల ప్రత్యేక అవసరాలపై శ్రద్ధ చూపడం, వారి రుణాల చెల్లింపును మినహాయించడం లేదా వాయిదా వేయడం సహాయకరంగా ఉంటుంది. అంతేకాక అంతర్జాతీయ సమాజం తీవ్రవాద వ్యతిరేకతపై ద్వంద్వ ప్రమాణాలను మానాలి. అణుభద్రత, సైబర్ భద్రతపై ఒప్పందాల అనుకూలీకరణకు ప్రయత్నించాలి. ప్రపంచపాలనలో ఐరాస ప్రధాన హోదా పటిష్టతకు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మెరుగుదలకు, వివిధ దేశాల మధ్య సమన్వయ సాధనకు జి20 వేదికను ఉపయోగించుకునే సమగ్ర, న్యాయ చట్ర రూపకల్పనకు అంతర్జాతీయ సమాజం విశ్వవ్యాప్త పాలనా వ్యవస్థను మెరుగుపరుస్తుంది. ప్రాంతీయ పాలన యంత్రాంగాలు, ప్రపంచ పర్యావరణ, ప్రజారోగ్య, దక్షిణ–దక్షిణ సహకారాన్ని ప్రోత్సహించాలి. ప్రపంచ టెలికమ్యూనికేషన్స్ యూనియన్, ఇంటర్నేషనల్ సివిల్ అడ్మినిస్ట్రేషన్, ఐరాస ఇతర సంస్థల కార్యక్రమాల మెరుగుదలకు అంతర్జాతీయ సంస్థలలో అధికారాలు మరింత సమతుల్యంగా ఉండాలి. కానీ అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్)లో అలాలేదు. ఇందులో చైనా ఓటింగ్ వాటా 6%. చైనా జిడిపి ప్రపంచ జిడిపిలో 20%. మరోవైపు ఐరోపా దేశాల జిడిపిప్రపంచ మొత్తంలో 15% ఉండగా, ఐఎంఎఫ్లో వారి ఓటింగ్ వాటా 20%.

మూడు ప్రధాన కారణాల వల్ల ప్రపంచం గణనీయంగా మారుతోంది. ప్రపంచ పాలన మారింది. 10, 20 ఏళ్ల క్రితం ప్రజలు వాణిజ్యం, పెట్టుబడి, మూలధన ప్రవాహాలు, ఛానెళ్ల నిర్వహణ, పరస్పరాధార నియమాల గురించి మాట్లాడేవారు. నేడు వాతావరణ మార్పు, సమాచారం నుండి ప్రజావసతి వరకు వివిధ రకాల సమస్యలు బహిరంగ చర్చలలో ఆధిపత్యం వహిస్తున్నాయి. ప్రపంచం అపూర్వ, అసమాన స్థాయి అభివృద్ధిని ఎదుర్కొంటోంది. పేద దేశాల తలసరి జిడిపి మూడింట ఒక వంతు పెరగగా, అమెరికా తలసరి జిడిపి రెండింతలు పెరిగింది. వివిధ రకాల ఆర్థికవ్యవస్థలు, విలువల వైవిధ్యతలతోనూ ప్రభావితమైన అభివృద్ధి ప్రాధాన్యతల వైవిధ్యాన్ని ఎలా నిర్వహించాలన్నది సమస్య. ఆర్థికశాస్త్రం, రాజకీయాల పెనవేత. అవి ఎప్పుడూ పూర్తి భిన్నంగా లేవు. ఇప్పుడు ప్రజలు ఆర్థిక పరస్పరాధారం, భౌగోళిక రాజకీయ శత్రుత్వం మధ్య నిరంతరం చర్యలలో ఉన్నారు. ఐరాసలో వీటో హక్కును రద్దుచేయాలి. మైనారిటీ అభిప్రాయాలను పరిగణించాలి. అమెరికా ఆయుధాలు అమ్మే కార్పొరేట్ల కొమ్ముకాయరాదు. చైనాను శత్రువుగా కాక పోటీ దేశంగా చూడాలి. చైనా సొంత ప్రపంచ వాణిజ్యం కొంత మానుకొని పేద, అభివృద్ధి చెందని, చెందుతున్న దేశాలకు సాయపడాలి.రష్యా సోవియట్ పంథాను పాటించాలి. ఇండియా సౌజన్యపక్షపాతం మానాలి. అమెరికా, నాటో, పాశ్చాత్య దేశాల పంచను వీడాలి.

వ్యాస రచయిత ప్రోగ్రెసివ్ ఫోరం కార్యదర్శి, 0490204545

శాస్త్రవేత్తల్లో మత విశ్వాసాలు

డాక్టర్ దేవరాజు మహారాజు

సైన్సు ఒక్కటే సైన్సును సమర్థిస్తుంది. అవసరమైతే విభేదిస్తుంది. తప్పిదం జరిగితే ఒప్పుకుంటుంది. సరిదిద్దుకుంటుంది. ఈ చర్య నిరంతరం కొన సాగుతూ ఉంటుంది. మతానికి ఆ సౌకర్యం లేదు. సౌలభ్యం లేదు. అది ఎదుటివారిని చంపి తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంటుంది. గతమైనా, వర్తమానమైనా మనకీ విషయం స్పష్టం చేస్తుంది. సత్యం తనని నమ్మమని ఎవరినీ ప్రాధేయపడదు. ప్రార్థించదు. ఆ అవసరం మతాలకుంది. సైన్సుకు లేదు. ఉదాహరణకు శాస్త్రవేత్తలంతా శని, ఆదివారాల్లో ఒక చోట సమావేశమై

" అవును, భూమ్యాకర్షణ శక్తి వాస్తవం వాస్తవం
నాకు తెలుసు భూమ్యాకర్షణ శక్తి వాస్తవం వాస్తవం
మాకు నమ్మకముంది, మేము నమ్ముతున్నాం
మా ఆత్మశక్తి పెరుగుతోంది పెరుగుతోంది
పైకి పైకి లేస్తున్నదంతా
కిందికి కిందికి రాక తప్పదు... ఆమెన్! " అని ఎప్పుడూ ఎక్కడా పాటలు పాడలేదు, ప్రార్థనలు చేయలేదు. వాళ్ళకు ఆ అవసరమే లేదు. సత్యం - దానికదే ఆవిష్కారమవుతుంది, దానికదే నిలబడుతుంది. మత విశ్వాసాలున్నవారికి అసత్యాల్ని, భ్రమల్ని, కల్పనల్ని నమ్మే ప్రయత్నంలో సెల్ఫ్ మెస్మరిజం, సెల్ఫ్ మోటివేషన్ అవసరం! అందువల్ల ప్రార్థనలు, కీర్తనలు, ధ్యానాలు, పూజలు, సమాధిలోకి పోవడాలు, శ్వాస మీద ధ్యాస పెట్టడాలు వగైరా అవసరమౌతాయి. ఇవి లక్షల సంవత్సరాలుగా, మిలియన్ల మంది ఆచరిస్తున్నా.. అసత్యం సత్యంగా మారలేదు. భ్రమ–వాస్తవం కాలేదు. లేని దేవుడు ఎక్కడా ఎవరికీ కనిపించలేదు. ఆగామి కాలాలలో కూడా ఇది ఇలాగే ఉంటుంది. అసత్యాన్ని సత్యంగా మార్చడం ఏ మతం వల్లా కాలేదు, కాదు! సత్యాన్ని ఎప్పుడూ దివిటీలా ఎత్తిపట్టేదే సైన్సు గనక, అసత్యాలు దానికి సుదూరంలోనే ఉంటాయి.

సైన్సు గురించి చెప్పుకోవాల్సిన మంచి విషయమేమంటే ఎవరు నమ్మినా నమ్మకపోయినా దాని అస్థిత్వం దానికి ఉంటుంది. అది కూడా వాస్తవంలో, సత్యంలో ఒక భాగంగా ఉంటుంది. మతం పరిస్థితి దీనికి భిన్నం. జనం నమ్మితేనే దాని అస్థిత్వం ఉంటుంది. జనం నమ్మకపోతే అది ఉండదు. అందువల్ల ఎక్కువ మందిని తన పరిధిలోకి లాక్కోవడానికి అది నిరంతరం ప్రచారం చేసుకుంటూ ఉంటుంది. వీలయితే ఆశ చూపిస్తుంది. వీలు కాకపోతే పీక నొక్కేస్తుంది. వైజ్ఞానిక చరిత్రలో ఎప్పుడూ, ఎక్కడా అలాంటి సంఘటనలు లేవు. మనుషుల్ని విడదీయకుండా అందరికీ మేలు చేసేది సైన్సు. మేలు జరుగుతుందని మాయమాటలు చెపుతూ జనాన్ని విడగొట్టేది మతం. సైన్సుకు సరిహద్దులే లేవు. కొత్త ఆలోచనలతో నిరంతరం తనని తాను మార్చుకుంటూ, ప్రపంచాన్ని మార్చుకుంటూ పురోగమనంలోకి దూసుకెళ్ళేది సైన్సు. మతం మారదు. మారనివ్వదు. దానిదెప్పుడూ తిరోగమనమే పురోగమనమనుకునే పరిస్థితి! జ్ఞానం పేరుతో విస్తరించిన 'మూఢత్వం' సమాజానికి ప్రమాదహేతువయ్యింది తప్ప నిరక్షరాస్యత, అమాయ కత్వం, అజ్ఞానం సమాజాన్ని ఎప్పుడూ దెబ్బతీయలేదు. అందుకే సమాజంలోని నిరక్షరాస్యత, అమాయకత్వం, అజ్ఞానం తగ్గించడానికి, మూఢత్వాన్ని ఛేదించ డానికి వైజ్ఞానిక స్పృహ అవసరమౌతుంది! అవసరమౌతూనే ఉంటుంది!!

ఇది ఇలా ఉంచితే శాస్త్ర సాంకేతిక, వైజ్ఞానిక రంగాలలో పనిచేసే వారంతా హేతువాదులు కారు. ఉద్యోగాన్ని ఉద్యోగంగా చేస్తూ వ్యక్తిగతమైన తమ మూఢ నమ్మకాల్ని నమ్మకంగా కాపాడుకుంటూనే ఉంటారు. వాళ్ళు ఉండడమే కాదు. సామాన్యుల్ని కూడా అయోమయంలో పడదోస్తున్నారు. అన్నీ తెలిసిన వైజ్ఞానికులకే ఇలాంటి బలహీనతలుంటే మనకెందుకు ఉండకూడదూ? అని కొందరు సామా న్యులు భావిస్తూ ఉంటారు. నిజానికి శాస్త్రసాంకేతిక, వైజ్ఞానిక రంగాలకు సంబం ధం లేని ఎంతోమంది సామాన్యులు కూడా తమ ఇంగిత జ్ఞానాన్ని నిద్రలేపి హేతు వాదులవుతున్నారు. టూకీగా చెప్పేదేమంటే చదువుకు, డిగ్రీలకు, హోదాలకు, పదవులకు, వైజ్ఞానిక స్పృహకు సంబంధం ఉండాలని మనం అనుకుంటూ ఉంటాం. కానీ, నిజానికి ఉండడం లేదు. గొప్ప చదువులు చదివినవారు, ఉన్నత పదవుల్లో ఉన్నవారు కూడా, మూఢ నమ్మకాల మురికిలో మునిగి తేలేవారున్నారు. అందుకు భిన్నంగా చదువు, హోదా లేని అతి సామాన్యజీవులు కూడా వైజ్ఞానిక స్పృహతో హేతువాదులుగా మారినవారు, మారుతున్నవారు ఉన్నారు. పెద్ద చదు వు, హోదా ఉన్నవారందరూ సామాన్యులకు ఆదర్శప్రాయంగా ఉండలేక పోవడం విచారకరం. చదువు, హోదా లేకపోయినా సమాజ గతిని ఆరోగ్యవంతమైన హేతు వాదం వైపు మళ్ళించే సామాన్యులు కూడా కొందరుండడం ఆనందించదగ్గ అంశం.

ఇక్కడ శాస్త్రవేత్తల్లో మత విశ్వాసాలు ఎలా ఉన్నాయన్నది పరిశీలిద్దాం. కొన్ని జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ప్రకటించిన వివరాల్ని విశ్లేషించుకుందాం. దేవుణ్ణి నమ్మే భారత శాస్త్రజ్ఞులు 27 శాతం అయితే యునైటెడ్ కింగ్‌డమ్‌లో 11 శాతం మాత్రమే. ఏదో ఒక శక్తి ఉంది అని నమ్మే భారత శాస్త్రజ్ఞులు 38 శాతమయితే యు.కె.లో 8 శాతమే! భారతీయ వైజ్ఞానికుల్లో 83 శాతం సెక్యులరిజంపై నమ్మకమున్నవారు. అదే యు.కె.లో మత సామరస్యం ఉన్నవారు 93 శాతం.

ఎలెన్ హావర్డ్ ఎక్లాండ్ ఆఫ్ రైస్ యూనివర్సిటీ వారు భారతదేశానికి బ్రిటన్‌కు పోలిక చూపెట్టారు. మత విశ్వాసాలు లేని శాస్త్రవేత్తలు ఇండియాలో 6 శాతమైతే, యు.కె.లో 65 శాతం మంది ఉన్నారు. మత సంబంధమైన కార్యక్రమాలకు హాజ రయ్యే శాస్త్రజ్ఞులు ఇండియాలో 32 శాతం ఉంటే యు.కె.లో 12 శాతమే ఉన్నారు. మత సంబంధమైన కార్యక్రమాలకు అసలు వెళ్ళకుండా ఉండే భారత శాస్త్రజ్ఞులు 19 శాతమయితే యు.కె.లో 68 శాతం మంది ఉన్నారు. ప్రతి మతంలోనూ కొన్ని కొన్ని మౌలికమైన అంశాలున్నాయని నమ్మేవారు భారత్‌లో 73 శాతమయితే యు.కె.లో 45 శాతం మంది. విచిత్రమైన పరిస్థితి ఏమిటంటే మతానికీ సైన్సుకు వైరుధ్యాలున్న సంగతి భారతీయ శాస్త్రవేత్తల్లో చాలా మంది ఆలోచించనే ఆలోచించరు. మత విశ్వాసాలు లేకపోయినా తమను నాస్తికులుగా ముద్ర వేయవద్దన్న శాస్త్రజ్ఞులు ఓ 16 శాతం మంది ఉన్నారు. సమాజంలో తమ విలువ తగ్గిపోతుందేమోనని వారికి భయం! ప్రపంచ పరిజ్ఞానం, మత విశ్వాసాలు భారతీయ శాస్త్రవేత్తలలో ఎలా ఉన్నాయోనని ట్రినిటి కాలేజీలోని ఇనిస్టిట్యూట్ ఫర్ ద స్టడీ ఆఫ్ సెక్యులరిజమ్ ఇన్ సొసయిటీ అండ్ కల్చర్ 2007లో నూటా ముప్పయి భారతీయ పరిశోధనా సంస్థల్లో పనిచేసే పదకొండు వందల శాస్త్రవేత్తల అభిప్రాయాలతో ఒక సర్వే నిర్వహించింది. ఇవన్నీ దాని ప్రకారం వచ్చిన ఫలి తాలే. వందల యేళ్ళు బ్రిటిష్ పాలనలో మగ్గిపోయిన మనం స్వాతంత్ర్యం సంపా దించుకుని ఏడు దశాబ్దాలు దాటిపోయినా ఇంకా మనకు సరిపడే విధానాలు రూపొందించుకోక బ్రిటిష్ పద్ధతులే అనుసరిస్తున్నాం. కానీ, విచిత్రం దైవభావం వదిలేయడంలో మనమూ, మన శాస్త్రవేత్తలూ ఇంకా ఎంతో వెనకబడే ఉన్నాం.

"మతం లేని వైజ్ఞానిక శాస్త్రం కుంటిదేమోగానీ, వైజ్ఞానికత లేని మతం మాత్రం పూర్తిగా గుడ్డిది" అని అన్నారు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్. ఆయన మరో విషయం కూడా చెప్పారు "మనకు అంతుపట్టని అనంతాలు రెండున్నాయి ఒకటి విశ్వ రహస్యం, రెండు మనిషి మూర్ఖత్వం. అయితే ఇందులో మొదటిది విశ్వరహస్యం గురించి నాకింకా కొన్ని అనుమానాలున్నాయి!" అని అంటే అనంతమైన మనిషి మూర్ఖత్వం గూర్చి ఐన్‌స్టీన్‌కు సందేహమే లేదన్నమాట! అందుకే ఎవరో అన్నారు Science does not know everything. Religion does not know anything! అని.

సైన్సు బాల్యదశలో ఉన్నప్పుడు మతం మంచి వయసులో ఉండి సైన్సుకు దేవుడనే బూచాడిని చూపి భయపెట్టింది. ఇప్పుడు సైన్సు యవ్వన దశకు చేరుకుంది. మతం మూఢ నమ్మకాల ముడుతలతో వృద్ధాప్యంలోకి జారుకుంటోంది. ఇతర కారణాలతో హత్యకుగురైనవారు ఎందరున్నా ప్రపంచంలో మత కారణాలతో ఊచకోతకు గురైనవారే ఎక్కువ. మతం మూడు రకాలుగా మానవాళికి హాని చేకూరుస్తుంది. ప్రజల్ని విడదీస్తుంది. ప్రజల్ని తన గుప్పెట్లో పెట్టుకుంటుంది. ప్రజల్ని బలహీనుల్ని చేస్తుంది. సైన్సు ఎప్పుడూ ఎక్కడా ఎవరినీ విడదీయలేదు. ఊచకోత కోయలేదు. సైన్సు ఫలితాలను దుర్వినియోగపరిచిన దుష్టబుద్ధులున్నారు. నిజమే! మతంతో మారణహోమం సృష్టించిన మనిషే, సైన్సును కూడా దురుపయోగం చేశాడు. మరీ దారుణమైన విషయమేమంటే వైజ్ఞానిక సూత్రాలకనుగుణంగా, వక్రీకరణలతో మతాలకు ఉన్నతమైన స్థానం కల్పించాలని చూస్తున్నాడు. ఇది తీవ్రంగా నిరసించవలసిన విషయం. ప్రపంచంలోని అన్ని యుద్ధాలకు, అసహనానికి, హింసకు, విద్వేషానికి, చెడుకు మూల కారణం మతమే కదా? కాదనడానికి ఆధారాలేవీ? "దయ్యాల్ని పూజించేవాడు నిరీశ్వరవాది" అని పుకార్లు పుట్టించి, ప్రచారం చేసి, సమాజంలో తమ ఆధిపత్యం నిలుపుకోవడానికి, నిరీశ్వరవాదుల్ని తక్కువగా చేసి చూపడానికి ఆస్తికులు నిరంతరం ప్రయత్నం చేస్తూ వచ్చారు. నిజానికి నాస్తికులు దేవుణ్ణే కాదు, దయ్యాన్ని కూడా నమ్మరు. దేవుణ్ణి నమ్మేవాడే దయ్యాన్ని నమ్ముతాడు.. భయంతోనో, భక్తితోనో.

పరిశీలన ఆధారంగా విజ్ఞాన శాస్త్రం తనను తాను నిత్యనూతనంగా మార్చుకుంటుంది. 'విశ్వాస'మనేది పరిశీలనలను నిరాకరించి, తన నమ్మకాన్నే కాపాడుకుంటుంది అని అంటాడు టిమ్ మిన్‌చిన్, ఆస్ట్రేలియా దేశపు హాస్య నటుడు, గాయకుడు. ఆస్థికుల్లో ఎంతోమంది దేవుడి పేరుతో పొట్టపోసుకుంటున్నవారు, వ్యాపారాలు చేసుకుంటున్నవారు, పేరుప్రఖ్యాతులు గడిస్తున్నవారు ఉన్నారు. నాస్తికులెవరూ తమ వాదనని ప్రజల్లోకి తీసుకుపోయి 'వ్యాపారాలు' చేసుకోవడం లేదు. తమ జీవనభృతి సంపాదించుకోవడం లేదు. జనానికి సత్యదర్శనం చేయిద్దామన్న కాంక్ష తప్ప మోసగాళ్ళబారిన పడుతున్న అమాయకులను, చైతన్యవంతులుగా తీర్చిదిద్దాలన్న ఆకాంక్ష తప్ప వారికి మరో ఉద్దేశం లేదు. ఏ సూత్రాల ఆధారంగా ఈ విశ్వం పరిణతి చెందింది. ఏ సూత్రాల ఆధారంగా జీవ పరిణామం జరిగింది. వాస్తవాలేమిటి? భ్రమలేమిటి? అని చర్చిస్తారు తప్ప మరొకటి చెయ్యరు. చర్చకు ఆహ్వానిస్తారు. ప్రశ్నను ప్రేమిస్తారు. కళ్ళగంతలు విప్పి వాస్తవాలు దర్శింపజేస్తారు. ఈ రెండు రకాలలో ఎవరు స్వార్థపరులు, ఎవరు నిస్వార్థపరులు అనేది జనమే నిర్ణయించాలి! A Man without God is a Man! A God without a man is nothing!!

వ్యాస రచయిత కేంద్ర సాహిత్య అకాడెమీ విజేత, జీవ శాస్త్రవేత్త

ప్రశ్నించిన మహిళపై బీజేపీ ఎమ్మెల్యే జులుం

బెంగళూరు: తనను ప్రశ్నించిన మహిళ పట్ల కర్నాటకలోని బీజేపీ ఎమ్మెల్యే దురుసుగా ప్రవర్తించారు. మహిళపై కేకలు వేయడమే కాకుండా ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకునేలా వ్యవహరిస్తు కెమెరాకు చిక్కారు. బెంగళూర్ నగరంలో ఎమ్మెల్యే పర్యటిస్తున్న సమయంలో ఈ ఘటన వెలుగుచూసింది.

తమ ప్రాంతానికి వచ్చిన మహదేవపుర ఎమ్మెల్యే అరవింద్ లింబావలిని కలిసేందుకు వచ్చిన మహిళ ఆయనకు సమస్యలను తెలిపేందుకు ప్రయత్నించగా ఆగ్రహంతో ఆయన కేకలు వేశారు. తన చేతిలో ఉన్న పేపర్‌ను చూపేందుకు మహిళ ప్రయత్నించగా ఆ పేపర్‌ను ఎమ్మెల్యే చించేశాడు.అపై ఆమెను అదుపులోకి తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.

ఈ వీడియో వీవీపీల దురుసు ప్రవర్తన, అధికార దుర్వినియోగాన్ని ఎత్తిచూపుతోంది. కాగా ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమిస్తూ పట్టుబడిన తన కుమార్తె పోలీసులతో దురుసుగా వ్యవహరించడంపై ఎమ్మెల్యే క్షమాపణ కోరిన మూడు నెలల అనంతరం తాజా ఘటన చోటుచేసుకుంది.

బసవశ్రీ అవార్డు వెనక్కిస్తున్నా

రామన్ మెగసెసె అవార్డు గ్రహీత సాయినాథ్

బెంగళూరు: మురుగా మఠం తనకు 2017లో ప్రదానం చేసిన బసవశ్రీ అవార్డును తిరిగి ఇచ్చేస్తున్నట్లు ప్రముఖ జర్నలిస్టు, రామన్ మెగసెసె అవార్డు గ్రహీత పి.సాయినాథ్ తెలిపారు. పాఠశాల విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన మురుగా మఠం పీఠాధిపతి శివమూర్తి మురుగా శరణరును అరెస్టు చేసిన తర్వాత ఈ అవార్డును తిరిగి ఇచ్చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు సాయినాథ్ ట్విట్టర్ వేదికగా ప్రకటించారు. 'బాధితులకు సంఘీభావంగా నేను ఈ నిర్ణయం తీసుకున్నాను. ఈ కేసులో బాధితులకు న్యాయం జరగాలని కోరుకుంటున్నాను. బసవశ్రీ అవార్డు కింద నాకు ఇచ్చిన రూ.5 లక్షల నగదును తిరిగి ఇచ్చేస్తున్నాను' అని పేర్కొన్నారు. పోక్సో, ఎస్‌సీ, ఎస్టీ చట్టం కింద మఠాధిపతిని అరెస్టు చేసినట్లు మీడియాలో వార్తలు చూశానని, మఠాధిపతి అలా చేయడం తనను తీవ్రంగా కలవరపరిచిందని తెలిపారు. చిన్నారులపై ఇలాంటి నేరాలకు పాల్పడటాన్ని ఏ విధంగానూ సహించజాలమని, దీని గురించి మాట్లాడటానికి పదాలు దొరకడం లేదని సాయినాథ్ వ్యాఖ్యానించారు. పీఠాధిపతి అకృత్యాలను వెలుగులోకి తీసుకొచ్చిన మైసూరు కేంద్రంగా పనిచేస్తున్న ఎన్‌జీఓ 'ఒడనాడి'ని ఆయన అభినందించారు. ఈ ఎన్‌జీఓ దశాబ్దాలుగా సామాజిక రుగ్మతలపై పోరాటం చేస్తోందని గుర్తుచేశారు.

చైనా లోన్ యాప్స్‌పై ఈడీ కొరడా

18 ప్రాంతాల్లో సోదాలు.. రూ.17 కోట్ల నగదు సీజ్

న్యూఢిల్లీ : చైనా లోన్ యాప్‌ల అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. దేశవ్యాప్తంగా 18 చోట్ల సోదాలు జరిపి రూ.17కోట్ల వరకు నగదును సీజ్‌చేసింది. పేమెంట్ గేట్‌వేస్ రోజర్‌పే, పేటీఎం పేమెంట్స్, క్యాష్‌ఫ్రీ పేమెంట్స్ కంపెనీల్లో ఈడీ సోదాలు నిర్వహిస్తోంది. డబ్బుల బదిలీకి నకిలీ బ్యాంకు ఖాతాలు ఉన్నట్లు ఈడీ అధికారులు గుర్తించారు. సోదాలలో రూ.17 కోట్లను సీజ్ చేశారు. బెంగళూరులో తొమ్మిది ప్రాంతాల్లో ఈడీ సోదాలు నిర్వహించింది.

లోన్ యాప్స్ ద్వారా రుణం కంటే ఆరు రెట్లు అధికంగా వసూలు చేసినట్లు అధికారులు గుర్తించారు. చైనా లోన్‌యాప్ అక్రమాలపై మనీలాండరింగ్ కేసులు నమోదు అయ్యాయి. ఈ యాప్‌లను చైనా వ్యక్తులే నియంత్రిస్తున్నారని ఈడీ తెలిపింది. బెంగళూరు పోలీసు సైబర్ క్రైం స్టేషన్ దాఖలు చేసిన 19 ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా మనీలాండరింగ్ కేసు నమోదు అయినట్లు ఈడీ వెల్లడించింది.

రేపు ఢిల్లీకి నితీశ్

పాట్నా: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ సెప్టెంబరు 5 నుంచి 7 వరకు ఢిల్లీలో పర్యటించనున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని గద్దె దించడానికి ప్రతిపక్షాల నింటినీ ఏకతాటిపైకి తీసుకొచ్చే ప్రయత్నంలో భాగంగా నితీశ్ రాజధానికి వెళుతున్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సహా ప్రతిపక్షాల నాయకులందరితో నితీశ్ విడివిడిగా భేటీ అవుతారు. ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, వామపక్ష నాయకులతోనూ నితీశ్ సమావేశమవుతారని జేడీయూ వర్గాలు తెలిపాయి. రెండు రోజులు జరిగే జేడీయూ జాతీయ కార్యవర్గం, జాతీయ సమితి సమావేశాలు శనివారం ఇక్కడ ప్రారంభమయ్యాయి.2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నాయకులందరినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చే బాధ్యతను నితీశ్‌కు జేడీయూ అప్పగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీజేపీతో బంధం తెంపుకొని...ఆర్‌జేడీ, కాంగ్రెస్, వామపక్షాలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత నితీశ్ ఢిల్లీకి వెళ్లనుండటం ఇదే మొదటిసారి. సుదీర్ఘకాలం బీహార్ ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవంతో జాతీయ రాజకీయాల్లోనూ కీలకపాత్ర పోషించాలని నితీశ్ కోరుకుంటున్నారు.

ఇద్దరు బీజేపీ ఎంపీలపై కేసు

విమానం టేకాఫ్ అనుమతికి ఒత్తిడి తెచ్చారంటూ డీఎస్పీ ఫిర్యాదు

దేవ్‌ఘర్ (జార్ఖండ్): ఛార్టర్డ్ విమానం టేకాఫ్ చేసేందుకు అనుమతి ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి తెచ్చిన ఇద్దరు బీజేపీ ఎంపీలు నిశికాంత్ దూబె, మనోజ్ తివారీపై కేసు నమోదైంది. ఎయిర్‌పోర్ట్ డీఎస్పీ ఫిర్యాదు మేరకు ఎంపీలు సహా 9 మంది పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ఇతరుల జీవితాలను ముప్పు వాటిల్లేలా వ్యవహరించడంతో పాటు, నియమాలు ఉల్లంఘించారన్న అభియోగాలు వారిపై మోపారు. జార్ఖండ్‌లోని దేవ్‌ఘర్ విమానాశ్రయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గత నెల 31న లోక్‌సభ ఎంపీ నిశికాంత్ దూబె, ఆయన కుమారులు, మరో ఎంపీ మనోజ్ తివారీ మరి కొందరు అనుమతి లేకుండా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ)లోకి ప్రవేశించారని, తమ ఛార్టర్డ్ విమానం టేకాఫ్ చేసేందుకు అనుమతి ఇవ్వాలని ఒత్తిడి తెచ్చారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. కొత్తగా ప్రారంభమైన విమానాశ్రయంలో రాత్రి పూట టేకాఫ్ చేసేందుకు అనుమతి లేదు. సూర్యాస్తమ సమయానికి 30 నిమిషాల ముందు వరకు మాత్రమే టేకాఫ్ చేసేందుకు అనుమతిస్తారు. కానీ ఎంపీలు చీకటి పడ్డాక తమ విమానం టేకాఫ్ చేయాలని ఒత్తిడి తెచ్చారని డీఎస్పీ తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై శుక్రవారం రాత్రి దేవ్‌ఘర్ కలెక్టర్ మంజునాథ్ భజంత్రీ, నిశికాంత్ దూబె మధ్య ట్విటర్ వార్ నడిచింది. జాతీయ భద్రతా నియమాలను బీజేపీ ఎంపీ ఉల్లంఘించారంటూ మంజునాథ్ ట్వీట్ చేశారు. ఎంపీ, తన కుమారులు, అనుచర గణంతో ఏటీసీ రూమ్‌లోకి ప్రవేశించడాన్ని తప్పుబట్టారు. దీనిపై దూబె స్పందిస్తూ... సీఎంకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ ట్వీట్ చేశారు. అయినా ఈ అంశం దర్యాప్తు స్థాయిలో ఉందని, వాస్తవాలు బయటకొచ్చాకే మాట్లాడాలని సూచించారు. తనపై వ్యాఖ్యలు చేసే ముందు ఏవియేషన్ రూల్స్ చదువుకోవాలని సూచించారు. ఈ వ్యవహారంలో పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, డీజీసీఏ జోక్యం చేసుకోవాలని అధికార జేఎంఎం డిమాండ్ చేసింది.

మాదక ద్రవ్యాల వ్యాపారికి బెయిల్ నిరాకరణ

న్యూఢిల్లీ: మాదక ద్రవ్యాల వ్యాపారికి కర్నాటక హైకోర్టు బెయిల్ నిరాకరించింది. పెద్దమొత్తంలో నిషిద్ధ మాదక ద్రవ్యాలు ఉన్న ఆ వ్యాపారిని పోలీసులు ఇంతకుముందు అరెస్టు చేసి జైలుకు పంపారు. నిందితుడిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద మేలో కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇద్దరికి బెయిల్ మంజూరైంది. ఆ ఇద్దరి వద్ద ఎక్కువగా మాదకద్రవ్యాలు లభ్యం కాకపోవడంతో బెయిల్ లభించింది. బెంగళూరులోని చామరాజ్‌పేట వాసి రాజేశ్(27)కు జస్టిస్ కె.నటరాజన్ బెయిల్ నిరాకరించారు. మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న రాజేశ్, మరో ఇద్దరు నిందితులను మే 22న కుమారస్వామి లేఅవుట్ పోలీసులు అరెస్టు చేశారు. రాజేశ్ పెజ్జా అవుట్‌లెట్‌లో డెలివరీ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. కాలేజీ విద్యార్థులు, ఐటీ/బీటీ ఉద్యోగులు, ఇతరులకు రాజేశ్ మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తున్నాడు. నిందితుల నుంచి ఐదు కిలోల గంజాయి, 20 గ్రాముల హాషిశ్ ఆయిల్, 20 ఎల్ఎస్‌డీ స్ట్రిప్‌లను స్వాధీనం చేసుకున్నారు. పెద్దమొత్తంలో మాదక ద్రవ్యాలు లభ్యం కావడంతో రాజేశ్‌కు బెయిల్ ఇవ్వడం సాధ్యం కాదని జస్టిస్ కె.నటరాజన్ పేర్కొన్నారు.

'పుణ్యకోటి' అంబాసిడర్‌గా సుదీప్

బెంగళూరు: పుణ్యకోటి దత్తు యోజన పథకం బ్రాండ్ అంబాసిడర్‌గా కన్నడ సినీనటుడు సుదీప్‌ను కర్నాటక ప్రభుత్వం నియమించింది. సుదీప్ పుట్టిన రోజును పురస్కరించుకొని రాష్ట్ర పశుసంవర్ధకశాఖమంత్రి ప్రభు బి చవాన్ ఈ మేరకు శుక్రవారం ట్విట్టర్ వేదికగా ప్రకటన చేశారు. తమ శాఖకు సంబంధించి పుణ్యకోటి పశువుల దత్తత పథకం ప్రచారం, అభివృద్ధి కోసం నటుడు, దర్శకుడు కిచ్చా సుదీప్‌ను అంబాసిడర్‌గా నియమించినట్టు మంత్రి ట్వీట్ చేశారు. గో రక్షణకు సంబంధించి ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం తీసుకొచ్చింది. సుదీప్‌కు మంత్రి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అంబాసిడర్‌గా పనిచేసేందుకు తానేమీ పారితోషికం లేదా వేతనం తీసుకోవడం లేదని సుదీప్ స్వయంగా ప్రకటించినట్లు మంత్రి వివరించారు.

మహిళపై దాడి కేసులో ముగ్గురి అరెస్టు

న్యూఢిల్లీ : సెంట్రల్ ముంబై, కమతిపురాలోని తన దుకాణం ముందుర స్తంభం ఏర్పాటు చేసి ప్రకటన బోర్డును ఉంచడంపై అభ్యంతరం వ్యక్తం చేసిన మహిళపై ఎంఎన్‌ఎస్ కార్యకర్తలు దాడికి దిగారు. అందరు చూస్తుండగానే ఆమెపై చేయిచేసుకున్నారు. వేధింపు దూషించారు. ఇది ఆగస్టు 28వ తేదీన జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ అయింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్‌ఎస్) కార్యకర్తలు ముగ్గురిని అరెస్టు చేశారు. తన దుకాణం ఎదుట పార్టీ ప్రకటన బోర్డు ఏర్పాటు చేయడంపై మహిళ అభ్యంతరం వ్యక్తం చేయడం వివాదానికి దారి తీసినట్లు పోలీసులు తెలిపారు. రాజ్ ఠాక్రే నేతృత్వ ఎంఎన్‌ఎస్ ఆఫీసు బేరర్ వినోద్ అర్గిలేతో పాటు ఇద్దరు కార్యకర్తలు రాజు అర్గిలే, సతీశ్ లాడ్ కలిసి మధ్యవయస్కురాలైన ఆ మహిళను చెంపలపై కొట్టారు. ఆమె తోసివేశారు. కింద పడేసి దూషించారు. బాధితురాలికి వైద్య పరీక్షలను పోలీసులు నిర్వహించినట్లు ఓ వార్తాసంస్థ పేర్కొంది. వాగ్వాదంతో మొదలు అయి భౌతిక దాడి వరకు ఈ వ్యవహారం వెళ్లిందని పోలీసులు చెప్పారు. ముగ్గురు కార్యకర్తల్లో ఒకరు బాధితురాలిని చెంపపై కొట్టగా గొడవ పెద్దది అయిందని, ఆమెను తోసేయడం, దుర్భాషలాడటాన్ని చుట్టూ గుమ్మిగూడిన జనం వీడియో తీశారని పోలీసు అధికారి తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో ఈ వీడియో వైరల్ కావడంతో ఐపీసీలోని 323 (దాడి), 506 (నేరపూరిత ఉద్దేశం), 509 (మహిళతో అనుచిత ప్రవర్తన) సెక్షన్ల కింద నాగపాడా పోలీసు స్టేషన్‌లో గురువారం ఎఫ్ఐఆర్ నమోదు అయిందని, రాత్రికి నిందితులు అరెస్టు అయ్యారన్నారు. అయితే వైరల్ అయిన వీడియో అసంపూర్ణంగా ఉందని, తమ పార్టీ మహిళలను గౌరవిస్తుందని, సంబంధిత మహిళ తమ పార్టీ బ్యానర్‌ను కాలితో కొట్టి, పార్టీ కార్యకర్తలను దూషించినట్లు ఎంఎన్‌ఎస్ స్థానిక నేత కేశవ్ ములే తెలిపారు. ఎడిట్ చేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టిందని చెప్పారు. ఈ చర్యను తామేమీ సమర్థించడం లేదని అన్నారు. వినోద్‌కు కోపం ఎక్కువేనని, న్యాయ వ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉందని ఆయన అన్నారు. ఈ ఘటనపై ఎంఎన్‌ఎస్‌పై నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) దుయ్యబట్టింది. 'ఇది అక్షేపణీయం.. దురదృష్టకరం' అని వ్యాఖ్యానించింది. ఎంఎన్‌ఎస్ అధ్యక్షుడు రాజ్‌ఠాక్రే తాజా ఘటనపై తన వైఖరిని వెల్లడించాలని ఎన్‌సీపీ అధ్యక్షుడు మహేశ్ తపాసె ఒక ప్రకటనలో డిమాండు చేశారు.

బీజేపీ డబ్బులు తీసుకోండి...

ఆప్ కోసం పనిచేయండి

కార్యకర్తలకు కేజ్రీవాల్ పిలుపు

రాజ్‌కోట్: ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ శనివారం సంచలన ప్రకటన చేశారు. 'మీరు బీజేపీలోనే ఉండండి. ఆప్ ఆద్మీ పార్టీ కోసం పనిచేయండి' అంటూ గుజరాత్ బీజేపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 'ఇంతకాలం బీజేపీ మీకు చేసిందేమీ లేదు. ఆ పార్టీ ఇచ్చే డబ్బు తీసుకోండి. మాకు పనిచేయండి' అని విజ్ఞప్తి చేశారు. బీజేపీలో ఉంటూనే అంతర్గతంగా ఆప్ కోసం పనిచేయాలని కేజ్రీవాల్ కోరారు. ప్రజలకు తాము ఇచ్చిన హామీలను అధికారంలోకి రాగానే అమలు చేస్తామని, దీనివల్ల బీజేపీ కార్యకర్తలు సైతం లబ్ధి పొందుతారని చెప్పారు. రెండ్రోజుల గుజరాత్ పర్యటనలో చివరి రోజైన శనివారం ఆయన రాజ్‌కోట్‌లో మీడియాతో మాట్లాడారు. 'మేము బీజేపీ నేతలను కోరుకోవడం లేదు. వారిని బీజేపీలోనే ఉంచుకోనివ్వండి. గ్రామాలు, బూత్‌లు, తాలూకాల్లో పనిచేసే బీజేపీ కార్యకర్తలు మాకు తోడుగా నిలిస్తే చాలు. నేను వారిని ఒక ప్రశ్న అడగదలచుకున్నాను. ఏళ్ల తరబడి పార్టీకి సేవలందించినందుకు బీజేపీ వారికి ఏమిచ్చింది? బీజేపీ కార్యకర్తలకు కానీ, వారి కుటుంబాలకు కానీ ఉచిత, నాణ్యమైన విద్య, ఆరోగ్య సేవలు, ఉచిత విద్యుత్ ఎప్పుడూ ఇవ్వలేదు. కానీ ఆప్ మాత్రం వాళ్ల సంక్షేమానికి చర్యలు తీసుకుంటుంది' అని కేజ్రీవాల్ స్పష్టం చేశారు. తమ వద్ద డబ్బులు లేకపోవడం వల్లే బీజేపీ కార్యకర్తలను ఆ పార్టీ ఇచ్చే నోట్లు తీసుకోవాలని కోరుతున్నామని చెప్పారు. ఆప్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉచిత విద్యుత్ ఇస్తామని, అది బీజేపీ కార్యకర్తల ఇళ్లకూ వర్తిస్తుందన్నారు. 24 గంటల విద్యుత్, పిల్లల కోసం పక్కా పాఠశాలల నిర్మాణం, ఆ బదులో ఉచిత విద్య అందిస్తామని హామీ ఇచ్చారు. వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా, నాణ్యమైన వైద్య చికిత్స అందిస్తామని, వారి కుటుంబంలోని మహిళలకు కుటుంబ నిర్వహణ కోసం రూ.1,000 చొప్పున ఇస్తామని కేజ్రీవాల్ తెలిపారు. బీజేపీ 27 ఏళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన తర్వాత కూడా వారిని కొనసాగించడంలో అర్థం లేదని ఆ పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి కేజ్రీవాల్ అన్నారు. 'మీరు తెలివైన వాళ్లు. అక్కడే (బీజేపీ) ఉంటూ ఆప్ కోసం పనిచేయండి' అన్నారు. అధికార బీజేపీని సవాలు చేస్తూ... 'ఇప్పటి వరకూ మీరు కాంగ్రెస్‌ను ఢీకొన్నారు, కానీ మేము ఆప్ వాళ్లం. సర్దార్ పటేల్, భగత్‌సింగ్ సిద్ధాంతాలను అనుసరిస్తాం. దాడులతో ఆప్ బెదిరించవచ్చని బీజేపీ అనుకుంటే అది పొరపాటు. భయపడటానికి మేము పిరికివాళ్లం కాదు. అన్యాయాలు, అవినీతిపై మేము పోరాడతాం.

6 కోట్ల మంది గుజరాత్ ప్రజలు ఇప్పుడు ఆప్‌ను ప్రత్యామ్నాయంగా చూస్తున్నారు. 27 ఏళ్ల బీజేపీ దుష్ట పాలనపై తీర్పు ఇవ్వబోతున్నారు' అని కేజ్రీవాల్ అన్నారు. రాబోయే 2, 3 నెలల్లో బీజేపీ వారు దాడులు చేస్తారని, ఆప్‌కు ఓటేస్తామని, బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడిన దాడులు తప్పవని, అయితే ప్రజలు ఎలాంటి ఆగ్రహావేశాలకు లోనుకావద్దని, బీజేపీకి చరమగీతం చెప్పేందుకు ఈవీఎం బటన్ నొక్కే సమయంలో ఆ ఆగ్రహం చూపించాలని విజ్ఞప్తి చేశారు. రాబోయే రోజుల్లో అన్ని వర్గాలను తాను వ్యక్తిగతంగా కలుసుకుంటానని చెప్పారు.

వాళ్లు 'తుక్డే తుక్డే' గ్యాంగ్ ఏజెంట్లు

మధ్యప్రదేశ్ హోంమంత్రి అనుచిత వ్యాఖ్యలు

భోపాల్: బాలీవుడ్ నటులు నసీరుద్దీన్ షా, షబానా అజ్మీ, రచయిత జావేద్ అక్తర్‌లను తుక్డే తుక్డే గ్యాంగ్ ఏజెంట్లు అని మధ్యప్రదేశ్ రాష్ట్ర హోంమంత్రి నరోత్తమ్ మిశ్రా అనుచిత వ్యాఖ్యలు చేశారు. వారు కేవలం బీజేపీ పాలిత రాష్ట్రాల్లోని సమస్యల గురించి మాత్రమే మాట్లాడతారని అన్నారు. రాజస్థాన్‌లో కన్హయ్యలాల్ హత్య, జార్ఖండ్‌లో ఒక మహిళ సజీవ దహనంపై షబానా అజ్మీ స్పందించకపోవడానికి కారణం అవి కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలని అన్నారు. తుక్డే తుక్డే గ్యాంగ్, అవార్డ్ వాపసీ గ్యాంగ్‌లకు ఈ ఘటనలు కనిపించవని ఆక్షేపించారు. కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీలను బీజేపీ తుక్డే తుక్డే గ్యాంగ్‌గా పేర్కొంటున్న విషయం తెలిసిందే.

బిల్కిస్ బానోపై సామూహిక అత్యాచారం కేసులో దోషులను విడుదల చేయడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. నిందితులను విడుదల చేయడంపై నిరసన వ్యక్తమవుతున్న క్రమంలో దోషుల విడుదలపై ప్రముఖ బాలీవుడ్ నటి షబానా అజ్మీ స్పందించారు. బీజేపీ పాలిత రాష్ట్రంలో ఏదైనా జరిగితే దేశంలో ఉండేందుకు భయపడుతారని మిశ్రా పేర్కొన్నారు. అదే సమయంలో అవార్డ్ వాపసీ గ్యాంగ్ క్రియాశీలం అవుతుందని, ఆ తర్వాత గొంతు చించుకుని ఏడవడం మొదలుపెడతారన్నారు. ఈ వ్యక్తులంతా తమ చెడు మనస్తత్వాన్ని ప్రదర్శిస్తున్నారని, దీన్ని నాగరికత, సెక్యులర్ అని ఎలా అంటారని ప్రశ్నించారు. మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో బిల్కిస్ బానో కేసులో దోషుల విడుదలను షబానా అజ్మీ ఖండించారు. పరిస్థితి దారుణంగా ఉందన్నారు. దోషుల విడుదల నిర్ణయంపై తాను సిగ్గుపడుతున్నానని, దీనిపై మాట్లాడటానికి తన వద్ద పదాలు లేవని పేర్కొన్నారు.

పెరుగుతున్న మధుమేహ రోగులు

పద్మా అవార్డు వైద్యుల ఆందోళన

న్యూఢిల్లీ: ఆరోగ్యరంగంలో భారతను ప్రపంచంలోనే అగ్రశ్రేణిగా మార్చేందుకు అనుసరించాల్సిన మార్గాలపై చర్చించడానికి పద్మ అవార్డులు స్వీకరించిన వైద్యుల బృందం సమావేశమైంది. 75 ఏళ్లలో ఆరోగ్యరంగం సాధించిన విజయాలు, ఆయా వ్యాధుల పరిస్థితిపై దృష్టి పెట్టింది. దేశంలో ఆరోగ్యానికి సంబంధించి ప్రస్తుత పరిస్థితి, మధుమేహ రోగుల సంఖ్య పెరుగుదలపై ఫోర్టిస్ సెంటర్ ఫర్ డయాబెటీస్, ఒబెసిటీ, కొలెస్ట్రాల్ చైర్మన్ డా.అనూప్ మిశ్రా మాట్లాడారు. మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరగడంపై అధ్యయనం చేయడానికి, దీనిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన చర్యలపై నిబద్ధత గల కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, దానికి కనీసం పదేళ్ల సమయం ఇవ్వాలని డా.మిశ్రా సూచించారు. దేశంలో మధుమేహ వ్యాధిని ఎదుర్కోవడానికి నేషనల్ మధుమేహ కార్యక్రమం కొనసాగుతున్నప్పటికీ ఈ మహమ్మారిని అరికట్టడానికి మరింత వ్యూహాత్మక విధానాలు అనుసరించాలని చెప్పారు. భారత్‌లో యువతరం సైతం డయాబెటిక్ రోగులుగా మారుతున్నారని, ప్రత్యేకించి ఊబకాయం ఎక్కువవుతోందని మిశ్రా తెలిపారు. ఇది చాలా ఆందోళనకరంగా మారిందన్నారు. 2011లో 30 ఏళ్ల వయసు గల వారికి మధుమేహ పరీక్షలు చేయడం ప్రారంభించారని, ఇప్పుడు 25 ఏళ్ల వారినే పరీక్షించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. జీవనశైలిలో మార్పులే మధుమేహ వ్యాధి అధికంగా ప్రబలడానికి కారణమని వ్యాఖ్యానించారు. కేరళ, ఢిల్లీ వంటి రాష్ట్రాల్లో మధుమేహ రోగుల సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. ఇక నుంచి ఒకరికి వ్యాపించని వ్యాధులపై వైద్యులు ప్రధానంగా దృష్టి కేంద్రీకరించారు. మధుమేహం, గుండెజబ్బు, కంటి జాగ్రత్తలు వంటి వాటిపై శ్రద్ధగా ఉండాలన్నారు. భారతను ఆరోగ్యరంగంలో ఉన్నతస్థాయికి తీసుకెళ్లడానికి అనుసరించాల్సిన మార్గాలపై అనేకమంది నిపుణులైన వైద్యులు తమ అభిప్రాయాలు, సలహాలు, సూచనలు చేశారు.

దళితులు వడ్డించింది తినొద్దు... పారవేయండి

విద్యార్థులను ఆదేశించిన వంటమనిషి అరెస్టు

ఉదయ్‌పూర్ : రాజస్థాన్, ఉదయ్‌పూర్‌లో కులవివక్ష తెరపైకొచ్చింది. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఇద్దరు దళిత బాలికలు వివక్షకు గురయ్యారు.

వారు వడ్డించిన మధ్యాహ్న భోజనాన్ని పారవేయాలని వంట మనిషి విద్యార్థులకు పురమాయించిన క్రమంలో ఆయనను అరెస్టుచేసినట్టు పోలీసులు శనివారం తెలిపారు. శుక్రవారం భోరోడీలోని ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో లాలా రామ్ గుర్జర్ అనే వ్యక్తి మధ్యాహ్న భోజనాన్ని వండిపెడితే ఇద్దరు దళిత బాలికలు దానిని విద్యార్థులకు వడ్డించారు. లాలా రామ్ అభ్యంతరం వ్యక్తంచేసి దళిత బాలికలు వడ్డించడం కాబట్టి ఆ ఆహారాన్ని పారవేయాలని విద్యార్థులకు సూచించారు. దీంతో విద్యార్థులు భోజనాన్ని పారవేశారు. బాధితులు విషయాన్ని తమ కుటుంబ సభ్యులకు తెలుపగా వారి బంధువులు స్కూలుకు చేరుకొని వంటమనిషిపై చర్యలకు డిమాండు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు గోగుందా పోలీసు స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ దురాగతాల చట్టం కింద కేసు నమోదు చేసి వంట మనిషి లాలా రామ్‌ను అదుపులోకి తీసుకున్నారు. లాలా రామ్ రోజు తనకు నచ్చిన అగ్రవర్ణాల పిల్లలతో వడ్డన చేయించేవాడుగానీ ఆ రోజు ఆ టీచరు ఇద్దరు దళిత బాలికలకు ఆ పనిని అప్పగించారు.

అగ్రవర్ణాల పిల్లలు సరిగ్గా వడ్డించడం లేదని ఫిర్యాదు రావడంతో ఆ పనిని మరో ఇద్దరికి ఇచ్చినట్లు తెలిసిందని పోలీసులు తెలిపారు.

కలెక్టరేట్ వద్ద యూపీ మంత్రి బైఠాయింపు

సీతాపూర్(యూపీ): భూములు అక్రమంగా స్వాధీనం చేసుకున్నారన్న సాకుతో 170 మంది గ్రామస్తులకు అధికారులు నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఉత్తరప్రదేశ్ మంత్రి సురేశ్ రహీ కలెక్టర్ కార్యాలయం ముందు శనివారం బైఠాయించారు. ఎలాంటి విచారణ జరుపకుండా గ్రామస్తులకు నోటీసులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఈ విషయాన్ని తాను స్వయంగా పరిశీలిస్తానని కలెక్టర్ హామీ ఇవ్వడంతో జైళ్లశాఖమంత్రి సురేశ్ తన నిరసనను విరమించారు. సీతాపూర్ జిల్లాలోని తన నియోజకవర్గంలో గల పిర్షహోరి గ్రామానికి చెందిన 170 మందికి ఎలాంటి విచారణ జరపకుండా అధికారులు నోటీసులు జారీ చేశారని సురేశ్ మండిపడ్డారు. వాస్తవంగా ఆ గ్రామానికి చెందిన 70శాతం మంది పురుషులు పనుల కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళతారని చెప్పారు. ముందుగా నోటీసులు వెనక్కి తీసుకొని..ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరపాలని, బాధ్యులను శిక్షించాలని మంత్రి డిమాండ్ చేశారు.



జేడీయూపై బీజేపీ ప్రతీకారం

- మణిపూర్‌లో కమలం గూటికి ఐదుగురు ఎమ్మెల్యేలు
- ఫిరాయింపులు రాజ్యాంగ విరుద్ధం: నితీశ్
- 2024 ఎన్నికల్లో గుణపాఠం: జేడీయూ

పాట్నా/ఇంఫాల్: బీహార్‌లో ఎన్‌డీఏ నుంచి బయటకి వచ్చి మహాకూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన జేడీయూ నేత నితీశ్‌కుమార్‌పై బీజేపీ ప్రతీకారం తీర్చుకుంటుందా? బీహార్‌ను పక్కన పెట్టి ఇతర రాష్ట్రాల్లో జేడీయూను తుడిచిపెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుందా? అందుకే మణిపూర్‌లో ఐదుగురు, అరుణాచల్‌ప్రదేశ్‌లో కొంతమంది జేడీయూ ఎమ్మెల్యేలను బీజేపీ లాక్కుందా? ప్రస్తుత పరిణామాలను పరిశీలిస్తే అవుననే సమాధానం లభిస్తోంది. మరోవైపు, మణిపూర్ ఫిరాయింపులపై నితీశ్‌కుమార్ తీవ్రంగా స్పందించారు. బీజేపీ నిస్సిగ్గుగా ఫిరాయింపులకు పాల్పడుతోందని విమర్శించారు. బీజేపీకి నైతిక విలువలు లేవు. రాజ్యాంగం అనలే పట్టదని నిందించారు.

మణిపూర్‌లో బీజేపీ అనైతిక, రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడింది. జనతాదళ్(యునైటెడ్)కు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలను కమలం వలలో విలీనం చేసుకుంది. బీహార్‌లో బీజేపీతో నితీశ్ కుమార్ మైత్రి బంధం తెగిపోవడంతో మణిపూర్‌లో జేడీయూకు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలను కమలం గూటిలో చేర్చుకోవడం సంచలనం రేపింది. మణిపూర్‌లో జేడీయూకు ఆరుగురు ఎమ్మెల్యేలు ఉండగా, ఐదుగురు బీజేపీలోకి ఫిరాయించారు. మణిపూర్‌లో జేడీయూ ముక్త్ లక్ష్యంతో తమ పార్టీ పనిచేసిందని బీజేపీ ఎంపీ సుశీల్ మోడీ వ్యాఖ్యానించారు. మణిపూర్‌లో ఐదుగురు జేడీ యూ ఎమ్మెల్యేలు బీజేపీలో విలీనమయ్యారని అసెంబ్లీ స్పీకర్ ప్రకటించారు. మైత్రీబంధం తెగిన తర్వాత నితీశ్ కుమార్‌కు బీజేపీ రెండోసారి షాక్ ఇచ్చింది. అరుణాచల్ ప్రదేశ్‌లో జేడీయూ ఏకైక ఎమ్మెల్యే టెక్ కాసో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సమక్షంలో బీజేపీలో చేరారు. 2019 అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఏడుగురు జేడీయూ ఎమ్మెల్యేలు విజయం సాధించగా వారిలో ఆరుగురు పార్టీకి గుడ్ బై చెప్పి కాషాయకండువా కప్పుకున్నారు. పార్టీ ఫిరాయింపులను బీజేపీ ప్రోత్సహిస్తుండటం 2024 ఎన్నికల్లో కమలం పార్టీని ఓడిస్తామని జేడీయూ అధికార ప్రతినిధి నీరజ్ కుమార్ చెప్పారు.

తమ పార్టీ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరడంపై నితీశ్‌కుమార్ ఆగ్రహం వెలిబుచ్చారు. నితీశ్‌కుమార్ శనివారం పాట్నాలో విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ ఫిరాయింపులకు పాల్పడటానికి గల రాజ్యాంగబద్ధత, జెనితన్నాన్ని ప్రశ్నించారు. ఎన్‌డీఏ నుంచి బయటకి రావాలన్న జేడీయూ నిర్ణయాన్ని మణిపూర్ పార్టీ ఎమ్మెల్యేలు సైతం సమర్థించారని గుర్తుచేశారు. తమ ఎన్‌డీఏలో ఉన్నప్పుడు తమ ఎమ్మెల్యేలను పట్టించుకోలేదు. ఇప్పుడు ఫిరాయింపుల కోసం ఎగబడుతోందని నితీశ్ నిందించారు. ఫిరాయింపులకు పాల్పడుతున్న బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని వ్యాఖ్యానించారు. 'బీజేపీ ఫిరాయింపులకు పాల్పడటం సరైనదేనా? ఇది రాజ్యాంగ వ్యతిరేకం కాదా? మన నియమ, నిబంధనలకు విరుద్ధం కాదా?' ఎక్కడ చూసినా బీజేపీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తోంది. అందుకే 2024 సార్వత్రిక ఎన్నికల్లో అన్ని పార్టీలు ఏకమై బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉంది' అని నితీశ్ పేర్కొన్నారు.

బీజేపీ కుట్రలు ఫలించవు: లాలన్

ఇతర పార్టీల నుంచి ఎమ్మెల్యేల కొనుగోలుకు బీజేపీ ధన బలాన్ని ప్రయోగిస్తోందని జేడీయూ జాతీయ అధ్యక్షుడు రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లాలన్ విమర్శించారు. బీజేపీ ఇప్పుడు మణిపూర్‌లో అనుసరించిన విధానాన్ని ఇంతకుముందు ఢిల్లీ, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో అమలుకు ప్రయత్నించిందని నిందించారు. మణిపూర్‌లో బీజేపీ అభ్యర్థులను తమ ఎమ్మెల్యేలు ఓడించారని, అరుణాచల్‌ప్రదేశ్‌లోనూ ఇదే జరిగిందని, తాము ఎన్‌డీఏలో ఉన్న సమయంలోనే ఇది జరిగినట్లు లాలన్ తెలిపారు. నితీశ్‌కుమార్ దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించాలని జేడీయూ కోరుకుంటున్న వేళ ఇలాంటి పరిణామాలు ఆ పార్టీకి ఇబ్బందికరంగా మారాయి. 2014 ఎన్నికల్లో ప్రత్యేకంగా పోటీ చేసినా ఇప్పుడు కుట్రలు చేసినా 2023 నాటికి జేడీయూ జాతీయపార్టీగా ఆవిర్భవించడాన్ని బీజేపీ ఆపలేదని లాలన్ స్పష్టం చేశారు. 'వాస్తవంగా బీజేపీ ఆందోళనలో ఉంది. 2015 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోదీ ఒక్కరే 42 బహిరంగ సభల్లో ప్రసంగించారు. బీహార్‌లో బీజేపీ గెలిచిన సీట్లు కేవలం 53 మాత్రమే. 2024లో మా భవిష్యత్ ఏమిటో అంటూ బీజేపీ ప్రశ్నించుకుంటుంది. బీజేపీకి ప్రతిపక్షం మొత్తం వ్యతిరేకంగా ఉంది. ఇదే బీజేపీకి పట్టుకున్న భయం' అని లాలన్ తెలిపారు.

వర్కింగ్ జర్నలిస్ట్‌ల చట్టానికి రక్షణ కల్పించండి

- కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌కు ఐజేయూ వినతి
- పత్రికా స్వేచ్ఛపై ప్రభావం చూపుతుందని ఆందోళన

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): వర్కింగ్ జర్నలిస్టుల చట్టానికి రక్షణ కల్పించాలంటూ ప్రెస్ అసోసియేషన్, వర్కింగ్ న్యూస్ కెమెరామెన్స్ అసోసియేషన్, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ ప్రతినిధి బృందం శనివారం న్యూ ఢిల్లీలో కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రి భూపేందర్ యాదవ్‌ను కలిసి విజ్ఞప్తి చేశాయి. కొత్త కోడ్‌ల వల్ల చట్టానికి భంగం కలుగుతుందని వివరించాయి. వర్కింగ్ జర్నలిస్ట్‌లు, ఇతర వార్తాపత్రికల ఉద్యోగుల (సేవా నిబంధనలు) కేటాయింపుల రద్దు తర్వాత తలెత్తిన సమస్య నేపథ్యంలో దేశంలోని జర్నలిస్టులు ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితులపై అసోసియేషన్‌లు, యూనియన్‌లు ప్రభుత్వాల దృష్టిని ఆకర్షించాయి. 1955 వర్కింగ్ జర్నలిస్ట్‌ల (వేతనాల రేట్లను నిర్ణయించడం) చట్టం, 1958... జర్నలిస్టుల పని పరిస్థితులపై ప్రతికూల ప్రభావం చూపడమే కాకుండా పత్రికా స్వేచ్ఛపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని సంఘాలు, యూనియన్‌లు భావించాయి. ప్రతినిధి బృందం ప్రెస్ అసోసియేషన్-అధ్యక్షుడు సి.కెనాయక్, కోశాధికారి లక్ష్మీదేవి, ప్రెస్ కౌన్సిల్ సభ్యుడు జైశంకర్ గుప్తా, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) అధ్యక్షుడు కె.శ్రీనివాస్ రెడ్డి, సెక్రటరీ జనరల్ బల్వీందర్ సింగ్ (జమ్ము), వర్కింగ్ న్యూస్ కెమెరామెన్స్ అసోసియేషన్ (డబ్ల్యూఎన్‌సీఏ) అధ్యక్షుడు ఎస్.ఎన్.సిన్హా, ప్రధాన కార్యదర్శి సోందీప్ శంకర్ జర్నలిస్టులకు వర్తించే కొత్త లేబర్ కోడ్‌ల కోసం ప్రభుత్వం నిబంధనలను ఖరారు చేయడంతో, ఈ కొత్త కోడ్‌లు వర్కింగ్ జర్నలిస్టుల చట్టానికి భంగం కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రెండు చట్టాలను రద్దు చేసిన తర్వాత, వర్కింగ్ జర్నలిస్టులు ఇప్పుడు కొత్త లేబర్ కోడ్‌ల ద్వారా పాలించబడ్డారు... జర్నలిస్టుల నిర్వచనంలో వార్తాపత్రికల స్థాపన మాత్రమే కాకుండా ఏదైనా ఎలక్ట్రానిక్ మీడియా లేదా డిజిటల్ మీడియాకు సంబంధించిన ఇతర సంస్థలు ఉన్నాయి... ఈ కోడ్‌లు ప్రస్తుతం ఈ మీడియా సంస్థలలో కొనసాగుతున్న హోదాలను పరిగణించవు... వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ద్వారా జర్నలిస్టులకు ఇచ్చిన కొన్ని ప్రత్యేక నిబంధనలు ఇప్పుడు పూర్తిగా రద్దు చేయబడ్డాయి... భవిష్యత్తులో జర్నలిస్టులు పాత్రికేయ పని సృజనాత్మక స్వభావాన్ని పరిగణనలోకి తీసుకోకుండా దేశంలోని ఇతర కార్మిక శక్తిగా పరిగణించబడతారు... పారిశ్రామిక వివాదాల చట్టం, 1947లోని నిబంధనలు వర్కింగ్ జర్నలిస్టులకు వర్తిస్తాయి... వివాదాస్పదమైన సందర్భంలో ఒక కార్మికుడిగా క్లెయిమ్ చేసుకోలేరు, ఎలాంటి ఉపశమనం పొందలేరు అని న్యాయస్థానం, సంఘాలు ఎత్తి చూపాయి. వర్కింగ్ జర్నలిస్టుల డ్యూటీ అవర్స్ ఆరు గంటలు, నైట్ షిఫ్ట్ అయితే ఐదున్నర గంటలు... కానీ ఇప్పుడు కొత్త కోడ్‌లలో అన్ని ఇతర పరిశ్రమల మాదిరిగానే ప్రభుత్వం నిర్ణయించింది. జర్నలిస్టులకు వేతనాలు నిర్ణయించడానికి వేజ్ బోర్డుల ప్రత్యేక నిబంధన ప్రకారం ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు ... యజమాని వేతనాలు చెల్లించడానికి అర్హులు. ఇది వేజ్ బోర్డులలో పేర్కొన్న వేతనాల రేటు కంటే ఏ సందర్భంలోనూ తక్కువ ఉండకూడదు... ఈ ప్రత్యేక నిబంధనలతో కార్మికులను నియమించుకోవడానికి, తొలగించడానికి యజమానులకు మరింత సౌలభ్యం ఇవ్వబడింది... కొత్త లేబర్‌కోడ్‌లు జర్నలిస్టుల నుంచి వారి స్వేచ్ఛను తీసుకున్నాయి... తాజాగా ఒక కేసులో జస్టిస్ డీవై జర్నలిస్టు స్వేచ్ఛను పరిరక్షించేందుకు సుప్రీంకోర్టులో చంద్రచూడ్ ఆరు ప్రధాన సూత్రాలను కూడా వివరించారు... రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) పరిధిలో పాత్రికేయ స్వేచ్ఛను పరిరక్షించ డానికి చట్టం అవసరమని అన్నారు. చట్టాలు రద్దు చేయడంతో జర్నలిస్ట్ ఇతర శ్రామిక శక్తితో సమానంగా ఉంటారు... అలాంటప్పుడు పాత్రికేయ స్వేచ్ఛను ఎలా ఆశించవచ్చు? రాష్ట్ర ప్రభుత్వాల తరహాలో సీనియర్ జర్నలిస్టులకు కేంద్ర ప్రభుత్వం పింఛను చెల్లించే అంశాన్ని పరిశీలించాలని జర్నలిస్టు సంస్థలు కూడా మంత్రిని అభ్యర్థించాయి. నాల్గవ స్తంభానికి స్వేచ్ఛ , గౌరవం ఉండేలా వర్కింగ్ జర్నలిస్ట్ చట్టంలోని ప్రత్యేక నిబంధనలకు రక్షణ కల్పించాలని వారు కేంద్ర కార్మిక మంత్రిని అభ్యర్థించారు. భూపేంద్ర యాదవ్ అన్ని సమస్యలను ఓపికగా విన్నారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడానికి మార్గాలను కనుగొనవలసిందిగా అధికారులను ఆదేశించారు.

అధిక ధరలపై నేడు కాంగ్రెస్ ర్యాలీ

న్యూఢిల్లీ: దేశంలోని అన్ని నిత్యావసరాలు ధరలు అమాంతం పెరిగిపోతుండటంపై ప్రతిపక్ష కాంగ్రెస్ ఆందోళన వ్యక్తంచేసింది. దీనిపై కేంద్రప్రభుత్వాన్ని నిలదీస్తామని ఉద్ఘాటించింది. సామాన్యుల వెతలు పాలక పక్షానికి పట్టడం లేదని దుయ్యబట్టింది. అధిక ధరలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, ప్రధాన ప్రతిపక్షంగా తాము ఊరుకోమని, వీధుల్లోకి వచ్చి పోరాడతామని పేర్కొంది. ఆదివారం దిల్లీ, రాంలీలా మైదానంలో 'మెహంగాయి పర్ హల్లా బోల్' ర్యాలీకి సర్వం సిద్ధమైనట్లు తెలిపింది. పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం విలేకరులతో మాట్లాడారు. మోదీ ప్రభుత్వ తప్పుడు విధానాలతో దేశ ప్రజలు కష్టాలు పడుతున్నారని అన్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు, ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలను కూల్చడంలో మోదీ ప్రభుత్వం నిమగ్నమైందని విమర్శించారు. ఈ ప్రభుత్వానికి సున్నితత్వం లోపించిందన్నారు. 2014 నుంచి 2022 వరకు నిత్యావసరాల ధరలు అమాంతం పెరిగాయని వేణుగోపాల్ అన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు జైరాం రమేశ్, అజయ్ మాకేన్ కూడా ఆయన వెంట ఉన్నారు.ఆగస్టులో బ్లాక్ డేనిర్వహించగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా అరెస్టు అయ్యారని, పార్లమెంటులోనూ ధరల పెంపుపై చర్చ కోసం డిమాండు చేశామని వేణుగోపాల్ తెలిపారు. సున్నితత్వం లోపించిన కారణంగా పాలక పక్షానికి సామాన్యుల బాధ తెలియడం లేదని, కేంద్రప్రభుత్వానికి ప్రజా వ్యతిరేక విధానాలని విమర్శించారు. ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ ధరల పెంపును నిరసిస్తున్నదన్నారు. అజయ్ మాకేన్ మాట్లాడుతూ, క్రోని క్యాపిటలిస్టు మిత్రుల బాగు తప్ప సామాన్యుల పరిస్థితి ఈ ప్రభుత్వానికి ఏ మాత్రం పట్టడం లేదు' అని అన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్నంటడాన్ని దుయ్యబట్టారు. రాంలీలా మైదానంలో జరిగే మెహంగాయి పర్ హల్లా బోల్ ర్యాలీలో మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీతో పాటు అనేక మంది పార్టీ నేతలు ప్రశంసగించనున్నారని నేతలు తెలిపారు. దిల్లీ, హరియానా, ఉత్తరప్రదేశ్‌తో పాటు దేశవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు ర్యాలీలో పాల్గొనున్నారన్నారు. కాగా, ఈనెల 7నుంచి కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారత్ జోడో యాత్ర ప్రారంభమవుతున్న సంగతి విదితమే.

ఆర్టెమిస్ ప్రయోగం మళ్లీ వాయిదా..

ఇంధనం లీకేజియే కారణం

ఫ్లోరిడా: అమెరికా అంతరిక్ష కేంద్రం 'ఆర్టెమిస్-1' ప్రయోగాన్ని ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. దీనిని ప్రయోగించేందుకు చేసిన ప్రయత్నం విఫలం కాగా దానిని మళ్లీ వాయిదా వేసింది. ఇంధనం లీకేజి కారణంగా తాము అనుకున్నట్లుగా జరగలేదని నాసా వెల్లడించింది. భారత కాలమానం ప్రకారం శనివారం రాత్రి ప్రయోగానికి ముహూర్తం ఖరారు కాగా ఇంధనం లీకేజీ వల్ల అది సాధ్యం కాలేదు. దీంతో ప్రయోగాన్ని వాయిదా వేస్తూ నాసా ట్వీట్ చేసింది. 'చంద్రుడిపైకి ఆర్టెమిస్- 1 మిషన్ వాయిదా పడింది. ఇంధనం నింపుతోన్న సమయంలో లీకేజీ సమస్య బయటపడింది. దాన్ని సరిచేసే ప్రయత్నాలు ఫలించలేదు' అని ట్విట్టర్‌లో నాసా పేర్కొంది. ఫ్లోరిడాలోని కెనెడీ అంతరిక్ష కేంద్రం నుంచి ఈ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లాల్సి ఉంది. ఆగస్టు 29న తొలిసారి ఈ ప్రయోగానికి నాసా సిద్ధం కాగా.. ఇంధన లీకేజీ సమస్యతో చివరి గంటలో ఈ ప్రయోగాన్ని నిలిపివేసింది. తాజాగా మరోసారి లీకేజీ సమస్యతోనే వాయిదా పడటం గమనార్హం. చంద్రుడిపైకి మనిషిని పంపే ప్రాజెక్టులో భాగమే ఆర్టెమిస్ 1. చంద్రుడిపై శాశ్వత ఆవాసానికి పునాదులు వేసే ప్రయత్నాల్లో భాగంగా నాసా ఈ ప్రయోగాన్ని చేపడుతోంది. అందులోని ఓరియన్ క్యాప్సూల్ మానవరహితంగానే చంద్రుడి కక్ష్యలోకి వెళ్లి రానుంది. 2024లో ఆర్టెమిస్-2, 2025లో ఆర్టెమిస్-3 ప్రయోగాలను నాసా చేపట్టనుంది.

ఐఐటీలు దేశానికి గర్వకారణం

భవిష్యత్ కోసం విద్యాసంస్థల్ని సిద్ధం చేయాలి: రాష్ట్రపతి

న్యూఢిల్లీ: ఐఐటీలు దేశానికి గర్వకారణమని, భవిష్యత్‌కు అనుగుణంగా విద్యాసంస్థలను తీర్చిదిద్దాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఐఐటీ దిల్లీ వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా ఆమె మాట్లాడారు. భారత్‌లో నైపుణ్యతకు కొదవ లేదని చెప్పారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యాసంస్థలు తయారు కావాలని, కొత్త రకం బోధన అవసరం ఉంటుందని సూచించారు. ఐఐటీల ద్వారా యువతరానికి మంచి మార్గదర్శకత్వం లభిస్తుందని ఆకాంక్షించారు. అవసరమైన పరిజ్ఞానం, విద్యాబుద్ధులు, నైపుణ్యతతో ఎదురయ్యే ఎలాంటి సవాళ్లనైనా మన యువతరం సమర్థంగా అధిగమించగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఐఐటీలు దేశానికి గర్వకారణమని అన్నారు. వీరిది కూడా స్వతంత్ర భారత గాథే అని చెప్పారు. భారత మేథోశక్తిని ప్రపంచానికి ఐఐటీ ఫ్యాకల్టీ, అలుమినీ చూపారని ఆమె అన్నారు. అంతర్జాతీయ వేదికపై భారత్‌ను మెరుగైన స్థానంలో నిలబెట్టడంతో ఐఐటీలది కీలక పాత్ర అని తెలిపారు. 2047 నాటికి దేశం శతాబ్ది ఉత్సవాలను జరుపుకుంటుందని, స్వాతంత్ర్యా నికి వందేళ్లు పూర్తి అవుతాయని, చుట్టూ ప్రపంచంలో తీవ్ర మార్పులు సంభవిస్తాయని, ఇందుకు నాల్గో పారిశ్రామిక విప్లవమే కారణమని ముర్ము అన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.